పర్యాటకులకు అనుమతుల్లేవ్ : సబ్‌కలెక్టరు

ఏజెన్సీలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలకు అనుమతులు నిలిపివేసినట్టు రంపచోడవరం సబ్‌కలెక్టరు కల్పశ్రీ తెలిపారు. ఎవరైనా వస్తే తిరిగి వెనక్కి పంపించాలని అధికారులను ఆదేశించారు. అయితే అటవీశాఖాధికారులు మాత్రం టిక్కెట్లు విక్రయించి మరీ పర్యాటకు లను జలపాతాల వద్దకు అనుమతించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడి పరిస్థితుల పట్ల అవగాహన లేక పర్యాటకులు ప్రాణాలమీదకు తెచ్చుకున్నారు.

వీళ్లు గల్లంతు



సౌమ్య



అమృత



హరదీప్



చికిత్సపొందుతున్న హారిణి



కన్నీటివాగు : ఒక్కసారిగా ఉధృతంగా మారి ఐదుగురిని ముంచేసిన జలతరంగణి వాగు ఇదే..

విషాదయాత్ర

ఎప్పుడూ చదువేనా.. కాస్త మార్పు కావాలనిపించింది.. పచ్చని ప్రకృతి ఒడిలో రోజంతా సేదదీరితే.. మళ్లీ రీఫ్రెష్ అవుతామని అనుకున్నారు.. అనుకున్నదే తడవుగా ఏలూరు ఆశ్రంలో మెడికల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 14 మంది తూర్పు ఏజెన్సీలోని అటవీ ప్రాంతానికి వచ్చారు.. మారేడుమిల్లి జలతరంగిణి జలపాతం వద్ద ఆగారు. అప్పటి వరకూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. తమ స్నేహానికి జీవితంలో గుర్తుండేలా ప్రకృతి అందాలతో కలిసి ఫొటోలు దిగారు. అకస్మాత్తుగా ప్రకృతి కన్నెర్ర చేసింది. వర్షపు నీరు వరదలా మారి క్షణాల్లోనే జలపాతంలోకి రావడం గమనించలేకపోయారు. ఒక్కసారిగా వరద పెరిగి 14మందిలో ఐదుగురు కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరిని మిగతా స్నేహితులు, అగ్నిమాపక సిబ్బంది కలిసి అతికష్టం మీద కాపాడారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. దీంతో వీరి విహార యాత్ర.. విషాదంగా మారింది. ఈ వ్యవహారంలో అటవీశాఖ నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇటీవల వర్షాల నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలకు అనుమతులు రద్దు చేశారు. అయినా జలంతరంగిణి వద్ద అటవీశాఖ సిబ్బంది వీరిని అనుమతించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

చూస్తుండగానే ముంచేసిన జలతరంగణి వాగు

- ఆశ్రం విద్యార్థుల విహారయాత్ర
- కళ్లెదుటే ఐదుగురు గల్లంతు
- క్షణాల్లోనే ఆవిరైన ఆనందం
- ఇద్దరిని కాపాడిన స్థానికులు
- కానరాని ముగ్గురి ఆచూకీ
- చీకటిపడడంతో ఆగిన గాలింపు
- అందరూ మెడికల్ విద్యార్థులే
- మారేడుమిల్లి వద్ద ఘటన
- రెండు రోజులుగా అనుమతుల్లేవ్

మారేడుమిల్లి/రంపచోడవరం, సెప్టెంబరు 22: వైద్య విద్యార్థుల విహారయాత్ర విషాదంగా మిగిలింది.అప్పటి వరకూ ఎంతో ఆనందం గడిపిన వారంత ఒక్కసారిగా హతాశులయ్యారు. అప్పటి ఎంతో ప్రశాంతంగా ఉన్న వాగు క్షణాల్లోనే ఉధృతంగా మారి తమ కళ్లెదుటే స్నేహితులను ముంచేయడంతో కన్నీటి పర్యంతమయ్యారు.ఏలూరు ఆశ్రం వైద్యకళాశాలలో ద్వితీయ సంవత్సరం మెడికల్ విద్యార్థులు 14 మంది విద్యార్థులు టెంపో ట్రావెల్ బస్‌లో శనివారం రాత్రి విహారయాత్రకు బయలుదేరారు. ఉదయం నుంచి పలు ప్రాంతాలు చూసుకుంటూ మధ్యాహ్నానికి అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని మారేడుమిల్లికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జల తరంగిణి జలపాతం వద్దకు చేరుకున్నారు. అక్కడే భోజనాలు చేసి మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రశాంతంగా కనిపించిన జలపాతంలోకి కొంత మంది స్నానాలకు దిగారు. కొంతమంది ఫొటోలు తీసుకుంటున్నారు. అప్పటికే వర్షం ప్రారంభమైంది. ఎగువ ప్రాంతాల్లో కూడా వర్షం పడుతోంది. వాగులో ఎర్రరంగు నీరు వస్తున్నా స్నానం చేసేవారికి అర్థం కాలేదు. ఫొటోలు తీసేవారు బురద నీరు వస్తోందని కేకలు వేస్తున్నారు. అయినా జలపాతం శబ్దంలో స్నానాలు చేసే వారు గమనించలేకపోయారు. క్షణాల్లోనే నీరు పెరిగిపోతుండగా వెంటనే కొంతమంది తప్పించుకోగా ఐదుగురు చిక్కుకుపోయారు. వాగు ఉధృతికి ఐదుగురు విద్యార్థులు గాయత్రి పుష్ప, చింతా హరిణి ప్రియ, కె.సౌమ్య, బి.అమృత, సీహెచ్ హరదీప్ కొట్టుకుపోయారు. వీరిలో ఒకరిని స్నేహితులు అతికష్టం మీద కాపాడగలిగారు.ఈలోపు పోలీసులకు సమాచారం అందింది. వారు వెంటనే రంపచోడవరం అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. కొండలపై నుంచి వర్షపునీరు ఉధృతంగా రావడంతో మిగిలినవారి జాడ తెలియలేదు.కాసేపటికి జలపాతం దిగువన కల్వర్టు వద్ద సిమెంట్ తూరల్లో ఒకరు ఉన్నట్టు గుర్తించి అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి కాపాడారు. గాయత్రి ప్రియ, చింతా హర్షిణీలను రక్షించారు. మిగిలిన ముగ్గురు విద్యార్థులు ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన చింతకుంట హరదీప్ (20), విజయనగరం జిల్లాకు చెందిన కొసిరెడ్డి సౌమ్య(21), బాలిఅమృత (22) గల్లంతయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఒకరిని మెరుగైన వైద్యంకోసం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చినట్టు సమాచారం. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయగా ..చీకటి పడిపోవడం.. వర్షం పడుతుండడంతో ఆటంకంగా మారాయి. రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మారేడుమిల్లి సీఐ సీహెచ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వైద్యవిద్యార్థుల కోసం తమ కళాశాల తరఫున ప్రత్యేక బృందాన్ని పంపించామని,వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఏలూరు ఆశ్రం కళాశాల యాజమాన్యం వెల్లడించింది.

ఆశ్రంలో తీవ్ర విషాదం..

గల్లంతైన వారు ఎక్కడైనా చెట్లను పట్టుకుని బతికి ఉన్నారేమో అనే ఆశతో తోటి విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. గల్లంతైనవారిలో చింతపల్లి హరదీప్‌కు బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా పేరుంది.కార్డియాలజీలో ప్రత్యేక వైద్యనిపుణుడిగా పేరు పొందాలనే ఆశయం చదువుతున్నాడు. బాలి అమృత తెలివైన విద్యార్థిని.. డాక్టర్ చదివి పేదల వైద్యురాలిగా పేరు పొందాలనే ఆశయంతోనే ఉంది. కొసిరెడ్డి సౌమ్య మంచి వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయాలనే ఆశయంతోనే చదువును కొనసాగిస్తోంది.ముగ్గురు విద్యార్థులు జలపాతం వద్ద కొట్టుకుపోయారని సమాచారం అందడంతో ఆశ్రం కళాశాలలో విద్యార్థుల్లో తీరని విషాదం నెలకొంది. ఘటనపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్టు మంత్రి చెప్పారు.

యాత్రకు వెళ్లింది వీరే..

మొత్తం 14మంది విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. **గల్లంతైన విద్యార్థులు :** కొసిరెడ్డి సౌమ్య(21), బాలి అమృత (22)(విజయనగరం జిల్లా), చింతకుంట హరదీప్(20)(ప్రకాశం జిల్లా మార్కాపురం), **గాయపడినవారు :** దండే గాయత్రి పుష్ప(బాపట్ల), సీహెచ్ హరిణి ప్రియ (విశాఖ జిల్లా మధురవాడ), పొట్లూరి ప్రజ్ఞ (భీమిలి),**మిగిలినవారు :** హిమబిందు(బొబ్బిలి), మేఘన(కర్నూలు), స్వప్న(అనంతపురం), హరినేత్ర(చీరాల), అవినాష్, హరిప్రియ, ధీరజ (రాజమండ్రి),జాగృతి(ద్వారకాతిరుమల)

పులిపిరి (సురిడి కాయ) ఆకు పసరుతో మటుమాయం

తూర్పుగోదావరి జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్స్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం
గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

23, 24, 25 తేదీల్లో కాకినాడ మెయిన్ రోడ్, చందనాబ్రదర్స్ ఎదురుగా, జయరాం హీరో షోరూమ్ ప్రక్కన, హోటల్ శ్రీవాత్స, కాకినాడ నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి చార్జి చేయబడును). **ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6.00 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు **youtube: pulipiri mallikarjun** లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు
సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్‌చేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

సార్ చెప్పారా..



సిఫారసు ఉంటే కోరుకొన్న చోటకు బదిలీ

- ఎమ్మెల్యేల సిఫారసులకే ప్రాధాన్యం
- 102 మందికి స్థానచలనం
- ఆరోపణలున్నా కోరుకున్న చోటుకే..
- కౌన్సెలింగ్‌లో ఉండగానే డీపీవో బదిలీ
- కొత్త డీపీవోగా శ్రీనివాసరావు
- పలువురు ఉన్నతాధికారుల బదిలీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పంచాయతీ సెక్రటరీల బదిలీల కోసం ఉత్తుత్తి కౌన్సెలింగ్ జరిగింది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫార్స్ లేఖలు పొందిన వారికే తొలి ప్రాధాన్యం ఇచ్చారు. వారు కోరుకున్న చోటకే ఎక్కువమందిని బదిలీ చేశారు. ఐదేళ్లు సర్వీసు నిండిన వారిని మొత్తం మార్చేశారు. అనారోగ్యం, రిక్వెస్ట్ బదిలీలను పరిగణనలోకి తీసుకున్నారు. జిల్లాలో సుమారు 103 మంది బదిలీలకు కౌన్సిలింగ్‌కు హాజరు కాగా 102 మందికి బదిలీ అవకాశం కల్పించారు. జిల్లాలో 300 గ్రామ పంచాయతీలు ఉన్న సంగతి తెలిసిందే. అందులో 102 మంది బదిలీ అయ్యారు. కొంతమంది బదిలీలు కోరుకోలేదు. అవకాశం ఉంటే వేరే జిల్లాలకు వెళ్లాలనే ఆలోచనతో ఉన్నారు. కానీ సోమవారంతో బదిలీల ప్రక్రియ ముగుస్తుంది.

కలెక్టరేట్‌లో ఉత్తుత్తి కౌన్సెలింగ్..

జిల్లాలోని బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న వారందరికీ కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.ఉదయం రాజమండ్రి డివిజన్ పరిధిలోని వారికి, మధ్యాహ్నం కొవ్వూరు డివిజన్ పరిధిలోని వారికి కౌన్సెలింగ్ జరిగింది. ఇన్‌చార్జి డీపీవో డి.రాంబాబు, రాజమహేంద్రవరం డీఎల్‌పీవో నాగలత, కొవ్వూరు డీఎల్‌పీవో అమ్మాజీ కౌన్సెలింగ్ నిర్వహించారు. పేరుకే కౌన్సిలింగ్ జరిగిందనే ప్రచారం ఉంది. ఎందుకంటే ముందుగానే ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేల, ఎంపీ నుంచి తీసుకున్న సిఫార్స్‌ల మేరకే బదిలీలు జరగడం గమనార్హం. మీరు ఏ ఎక్కడికి కోరుకున్నారు అని అడగడం.. ఫలానా చోటని చెప్పడం.. సరే..ఓకే అని చెప్పడం.. ఇలానే కౌన్సెలింగ్ జరిగింది. ఒకట్రెండు చోట్ల ఇబ్బంది అయినట్టు తెలిసింది.ఒక సెక్రటరీ ఒక పంచాయతీని కోరగా.. అప్పటికే అక్కడ ఓ ఎమ్మెల్యే మరొకరికి సిఫార్స్ లెటర్ ఇచ్చారు.. దీంతో ఇబ్బంది తలెత్తింది. అయితే వెంటనే ఆ సెక్రటరీకి ఒక ఫోన్ వచ్చింది.. ఎవరు ఏమి మాట్లాడారో కానీ సదరు సెక్రటరీ మరో పంచాయతీని కోరగా అది ఖాయం చేశారు. గతంలో సస్పెండై, వివిధ ఫిర్యాదులున్న వారికి కోరుకొన్న చోట బదిలీ అవకాశాలు కల్పించడం గమనార్హం. ఒక సెక్రటరీ బదిలీ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టిలో పెట్టినట్టు తెలిసింది.ఇతర జిల్లాలకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని మాత్రం తర్వాత పిలుస్తామని పంపించేశారు.చివరకు జిల్లాలో 102 మంది సెక్రటరీలను బదిలీ చేయగా వారిలో ఎక్కువ మంది కోరుకున్న చోట కే బదిలీ అయ్యారు.చాలా మంది సెక్రటరీలు తాము కోరుకున్న విధంగా పంచాయతీలను దక్కించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.ప్రస్తుతం బదిలీ పొందిన వారంతా సుమారు వారం రోజుల్లో విధుల్లో చేరవలసి ఉంది.

పనిచేసిన డబ్బు..

మని మేక్స్ మెనీ థింగ్స్.. బదిలీల్లో ఇదే జరిగింది.. డబ్బు చేయలేని పనిలేదని నిరూపించింది. ఎందుకంటే ఆరోపణలున్న వారిని కోరుకున్న చోటుకే బదిలీ చేయడం గమనార్హం. అదే విధంగా సిఫార్స్ లేఖ ఉంటే రైట్ రైట్ అన్నారు. కౌన్సెలింగ్ ఎందుకు పెట్టారనేది చాలా మందికి అర్థం కాని అంశం. ఎందుకంటే ఎవరు కోరుకున్న చోటుకు వారిని బదిలీ చేసేశారు. ఈ మాత్రం దానికి కౌన్సెలింగ్ ఎందుకనేది పలువురి వాదన. డబ్బు బాగా చేతులు మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అయ్యో పాపం ఇన్‌చార్జి డీపీవో..

జిల్లాలోని సెక్రటరీలకు కౌన్సిలింగ్ ఇస్తూ ఆదివారం బిజీగా ఉన్న జిల్లా ఇన్‌చార్జి డీపీవో డి.రాంబాబుకు చుక్కెదురైంది. కౌన్సిలింగ్‌లో ఉండగానే ఆయను బదిలీ చేయడంతో పాటు హెడ్ ఆఫీసులో రిపోర్ట్ చేయాలనే ఆర్డర్ రావడం గమనార్హం. ఆయన ఎంపీడీవో స్థాయి అధికారి. ఇక్కడ ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారిగా వ్యవహరిస్తున్నారు.

డీపీవోగా శ్రీనివాసరావు

తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అధికారిగా బి.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన డీఎల్‌డీవో హోదాలో ఇప్పటి వరకూ ఏపీసీ ఎస్‌ఎస్‌ఏగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఆయనకు ప్రమోషన్ ఇచ్చి జిల్లా పంచాయతీ అధికారిగా నియమించారు.కొవ్వూరు డీఎల్‌డీవో వి. శాంతామణికి ప్రమోషన్ ఇచ్చి అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారిగా నియమించారు.జిల్లాలో పలువురు ఎంపీ డీవోలు, ఈవోపీఆర్‌డీలు కూడా బదిలీ అయ్యారు.

ఏపీ టిడ్కో ఎస్‌ఈగా కోటేశ్వరరావు

ఏపీ టిడ్కో ఎస్‌ఈగా వైవీ కోటేశ్వరరావు విజయవాడ నుంచి వచ్చారు. రాజమహేంద్రవరంలో పనిచేస్తున్న ఎంసీహెచ్ కోటేశ్వరరావు విజయవాడ వెళ్లారు. పబ్లిక్ హెల్త్ రాజమండ్రి సర్కిల్ ఎస్‌ఈ ఎ.సుధాకర్ విశాఖపట్నానికి బదిలీ అయ్యారు.ఆయన స్థానంలో రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎస్‌ఈ జి.పాండురంగారావు నియమితులయ్యారు.కార్పొరేషన్ ఎస్‌ఈగా వై.కృష్ణారావు (విజయవాడ) నియమితులయ్యారు. డ్వామా పీడీగా ఎ.నాగమహేశ్వరరావు నియమితులయ్యారు. రాజమహేంద్రవరం ఈఈ ఆర్‌వీ శేషగిరిరావు ఏలూరు ఏపీ టిడ్కో ఈఈగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో వెంకటేశ్వరరావు బదిలీపై నియమితులయ్యారు.

కొవ్వూరులో.. వీడని టెన్షన్!



శ్రీరామకాలనీ(తుని కాలనీ)

నివురుగప్పిన నిప్పులా మారిన ప్రాంతం

- ఇంకనూ చల్లారని గొడవలు
- 19న ఇరువర్గాల మధ్య ఘర్షణ
- మూడు రోజులైనా అదే తీరు
- 100 మందిపై కేసులు నమోదు
- ఇరువర్గాల్లో 50 మందికి నోటీసులు
- 200 మంది పోలీసుల పహరా
- రోడ్డు వేస్తేనే సమస్యకు పరిష్కారం



రాజీవ్‌కాలనీలో పోలీస్ పహరా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు

కొవ్వూరు శివారులోని తుని పేట, రాజీవ్ కాలనీ (మత్స్యకార) ప్రాంతాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. గణేశ్ శోభాయాత్రలో ఆకతాయిలు తెచ్చిన గొడవ చినికి చినికి రెండు సామాజిక వర్గాల మధ్య చిచ్చు రగిల్చింది. కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరికి గాయాలయ్యే వరకూ వెళ్లింది. గొడవ మూడు రోజుల ముందే మొదలైంది. దీనిని పసిగట్టి గద్దించడంలో అటు పోలీసులు, ఇటు ఇరువర్గాల పెద్దలు విఫలం కావడంతో పరిస్థితి తీవ్రమైంది.చిన్న తగాదా సర్దుబాటు చేయడంలో కాస్త అదమరుపుగా ఉండడం పెద్ద రగడకు దారితీసింది. ప్రస్తుతం నిశ్శబ్దంగా ఉన్నా ఆ రెండు కాలనీల్లో ఏ క్షణంలో ఏం జరుగుతుందో అనే టెన్షన్‌పై 'ఆంధ్రజ్యోతి' గ్రౌండ్ రిపోర్ట్.

మూడు రోజుల కిందట జరిగిందిదీ!

ఈ నెల 19న రాత్రి సమయంలో రాజీవ్ కాలనీలోని గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం కోసం శోభాయాత్రగా తీసుకెళుతున్నారు. ఈ కాలనీ నుంచి సాధారణంగా హైవేకు తుని పేట (ఎస్సీ కాలనీ), శ్రీరామ కాలనీ మధ్యలోని రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటారు.ఆ రోజు కూడా పోలీసులు కేటాయించిన రూట్ మ్యాప్ ప్రకారం అదే దారిలో వెళుతున్నారు. సరిగ్గా ఎస్ టర్నింగ్ దగ్గరకు వచ్చేసరికి తుని కాలనీ కుర్రాళ్లు కొందరు శోభాయాత్ర చేస్తున్న వాళ్లను కవ్వించడంతో రాళ్లతో దాడికి దిగారు. ఆ రోజు ఎస్‌ఐకి రాయి తగిలి గాయమైంది. ఎస్పీ నర సింహ కిశోర్ సుమారు 200 మంది పోలీసు సిబ్బందితో సంఘటనా ప్రదేశానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.ఆ మరుసటి రోజున తుని పేటకు చెందిన నలుగురు యువకులు ఇద్దరు మత్స్యకార యువకులపై దాడి కి దిగారు.ఈ విషయం తెలియడంతో సుమారు 200 మంది మత్స్యకారులు తుని పేటలోకి వెళ్లి ఆటో, 3 ద్విచక్ర వాహనాలను పాక్షికంగా ధ్వంసం చేశారు.

35 ఏళ్ల కిందట వచ్చి.. స్థిరపడి..

తుని ప్రాంతం నుంచి పొగాకు బ్యారన్లలో పనిచేయడానికి తుని నుంచి కొందరు సుమారు 38 ఏళ్ల కిందట ఈ ప్రాంతానికి వచ్చారు.అందువల్ల దీనిని తుని పేట అంటారు. చిత్రం ఏమిటంటే.. మత్స్యకారులు ఉపాధి నిమిత్తం దాదాపు 33 ఏళ్ల కిందట తుని ప్రాంతం నుంచే ఇక్కడికి వచ్చారు. అప్పటి నుంచీ ఏ ఇబ్బందీ లేకుండా జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు తునికాలనీ, మత్స్యకార కాలనీకి మధ్య రోడ్డు లేక తీవ్ర ఇబ్బంది పడేవాళ్లు. ఎన్నో పోరాటాల తర్వాత సిమెంటు రోడ్డు వేశారు. దీంతో రాజీవ్ కాలనీ నుంచి ఇటు, తుని పేట నుంచి అటు రాకపోకలు సులభమయ్యాయి. తదనంతర పరిణామాల నేపథ్యంలో రెండు కాలనీల వాళ్ల మధ్య సఖ్యత లేకపోవడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. రెండు కాలనీల వాళ్లు తుని పేట మీదుగానే వెళ్లాల్సి రావడంతో వెళ్లినప్పుడు వచ్చినప్పుడు ఏదో ఒక విధంగా గొడవ పెట్టుకుంటున్నారు.



గొడవ జరిగిన ప్రాంతమిదే

రోడ్డు వేస్తేనే సమస్యకు పరిష్కారం

మత్స్యకార కాలనీకి చివరన అటు హైవేకు, ఇటు గోదావరి గట్టుకు వెళ్లే రోడ్డు ఉన్నా ఆ దారుల్లో సరైన సదుపాయాలు లేవు. పైగా గోదావరి గట్టు దారిలో వెళితే చుట్టూ తిరిగి వచ్చే పరిస్థితి ఉంది. దీంతో స్కూలు పిల్లలకు, వివిధ పనులపై వెళ్లే మత్స్యకారులకు దూరాభారం. దీంతో కచ్చితంగా తుని కాలనీ చివర వీధిగుండా వెళ్లాల్సిందే. కవ్వింపు స్థాయిలో ఉండే గొడవలు పోలీసుల పహరా వరకూ వచ్చాయి. అందువల్ల గతంలో ప్రతిపాదించిన మాదిరిగా మత్స్యకార కాలనీ చేరువలో ఉన్న చెరువు పక్కగా కొవ్వూరు ప్రధాన రహదారిని కలుపుతూ సుమారు ఒక కిలోమీటరు రోడ్డు వేస్తే సమస్యకు చాలా వరకూ పరిష్కారం దొరికే అవకాశం ఉంది. లేకపోతే రానున్న రోజుల్లో కూడా ఇక్కడ పరిస్థితులు సమస్యలను కొనితెచ్చే విధంగానే ఉంటాయని స్థానికులు చెబుతున్నారు.

200 మందితో పోలీస్ పహరా

ఈ ప్రాంతాల్లో సుమారు 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో డీఎస్పీ దేవ కుమార్ ఆధ్వర్యంలో కొవ్వూరు టౌన్ సీఐ వి.విశ్వం, రూరల్ సీఐ విజయ్ కుమార్, దేవరపల్లి సీఐ శేఖర్‌బాబు, సీఐ పవన్ కుమార్ రాజమండ్రి, కొవ్వూరు సబ్-డివిజన్ల సిబ్బందితో పహరా కాస్తున్నారు.పలు వీధుల్లో పోలీసులను మోహరించారు. ఇరువర్గాలకు కౌన్సెలింగ్ చేస్తున్నారు.సుమారు 100 మందికి నోటీసులు ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. ఇప్పటికే 50 మందికి సెక్షన్ 41 ప్రకారం నోటీసులు అందజేసి విచారణకు హాజరు కావాలన్నారు.అల్లర్లు చెలరేగిన రోజు వీడియోలు సేకరించారు. ఐదు రకాల కేసులను బనాయిస్తున్నట్లు తెలుస్తోంది.10 మంది యువకుల అసాంఘిక కార్యకలాపాల వల్ల ఈ రెం డు కాలనీల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలుస్తోంది.ప్రధానంగా వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు కావాలంటే వేస్తాం..



ఇప్పటికే తునికాలనీ వాళ్లను పిలిచి మాట్లాడాం. మత్స్యకారులతోనూ మాట్లాడతాం. ఇరువర్గాలూ సంయమనం పాటించాలి.గొడవల సంస్కృతి మంచిది కాదు.. పిల్లల జీవితాలు ఇబ్బందుల్లో పడ తాయి. ఒకవేళ రోడ్లు, డ్రైన్ల వంటివి వేస్తే సమస్యలకు పరిష్కారం దొరుకే అవకాశం ఉంటే కచ్చితంగా త్వరితగతిన రోడ్డు వేయడానికి చర్యలు తీసుకుంటాం. ఆయా కాలనీల్లోని పెద్దలు కూడా యువకుల నడతను గమనిస్తూ తీవ్ర ప్రవర్తన ఉంటే మందలిస్తూ ఉండాలి.

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

సామాజిక స్పృహ అవసరం



సామాజిక స్పృహ అవసరం. ఒకరిని ఒకరు గౌరవించుకోవాలి.ఇప్పటికీ ఇలాంటి ఘటనలు జరుగుతుండడం విచారకరం. రెండు కాలనీల్లో పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించాం. పరిస్థితి అదుపులోనే ఉంది. ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అంచనా వేస్తున్నాం. కౌన్సెలింగ్ చేస్తున్నాం. మరో రెండు మూడు రోజులు ఇదే మాదిరిగా బందోబస్తు ఉంటుంది. తర్వాత కొద్ది రోజుల పాటు పికెట్‌లు ఏర్పాటు చేస్తాం. శాంతి భద్రతలకు, సాధారణ జనజీవనానికి విఘాతం కలిగించే వాళ్లను విడిచిపెట్టం. అసాంఘిక వ్యక్తులను ఉపేక్షించేది లేదు. కేసులు ఎదుర్కోవాల్సిందే. - **నరసింహ కిశోర్, ఎస్పీ**

సాంస్కృతిక వారసత్వానికి పెద్దపీట వేస్తాం : దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22: సాంస్కృతిక వారసత్వానికి పెద్దపీట వేస్తామని రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఆదివారం రాత్రి శ్రీలలిత కళ నృత్యనికేతన్ ఆధ్వర్యంలో భారతీయ నృత్యోత్సవం -13 కార్యక్రమం జరిగింది.మంత్రి దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళలు, సాంస్కృతిక వారసత్వానికి పెద్దపీట వేస్తుందన్నారు.పోటాపోటీగా నృత్యాలు చేసిన చిన్నారులను అభినందించారు. మన భాషా మన కళా సంస్కృతి ప్రాభవం కోల్పోతున్న నేపథ్యంలో వందలాది మంది చిన్నారులు కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తుంటే మన కళ శాశ్వతంగా అజరామరంగా నిలిచిపోతుందన్నారు. అద్భుత కళాకారుడుగా ఎదిగిన రాజమహేంద్రవరాకి చెందిన నాట్యగురువు ఆరవ అంజనేయులును అభినందించారు. ఈ కార్యక్రమంలో నృత్యగురువులు, సంగీత కళాకారులు, అధ్యాపకులు, కూచిపూడి కళాకారులు,విద్యా ర్థులు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి పర్యాటక రంగంపై 4 కేటగిరిల్లో జిల్లా స్థాయి పోటీలు

ప్రపంచ పర్యాటక దినోత్సవం -2024 పురస్కరించుకుని ఈనెల 27 నుంచి నన్నయ్యయూనివర్శిటి క్యాంపస్ ఎన్‌టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పర్యాటక అంశాలపై జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. వకృత్వ, క్విజ్, వీడియోరీల్స్, ఫొటోగ్రఫీ విభాగాల్లో ఆసక్తిగల ఔత్సాహిక యువతి యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. గరిష్టంగా ఒక్కొక్క కళాశాల నుంచి 4 నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉందన్నారు. మరింత సమాచారం కోసం నన్నయ యూనివర్శిటి హెచ్‌వోడీ ప్రొఫెసర్ ఎస్.ఉదయభాస్కర్ 91823 01625, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం నెంబరు 63099 42025, టూరిజం సీనియర్ అసిస్టెంట్ బి.అన్వర్ హుస్సేన్ 9121725757, టూరిజం జూనియర్ అసిస్టెంట్ కె.సురేష్ కుమార్ 70365 30828ను సంప్రదించాలన్నారు.



మూడు రోజులలో 14 రైళ్లు రద్దు

సామర్లకోట, సెప్టెంబరు 22: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కొవ్వూరు, గోదావరి, రాజమహేంద్రవరం, కడియం సెక్షన్‌లలో నాన్ ఇంటర్‌లాకింగ్ ప్రక్రియ, ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టమ్‌ల ఏర్పాటు నిమిత్తం రైల్వే సిబ్బంది పనులు చేపట్టనున్నందున ఈనెల 29, 30 అక్టోబరు 1లో వివిధ ప్రాంతాల నుంచి సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే 14 రైళ్లను రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్వో నస్రత్ ఎం.మండ్రూప్‌కర్ సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు ఆది వారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సేకరించిన సమా చారం ఇలా ఉంది.

తిరుపతి-విశాఖ (22708) రైలు, గుంటూరు-విశాఖ(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు ఈనెల 29న రద్దు చేశారు. విశాఖ-తిరుపతి(22707) ఎక్స్‌ప్రె స్, విజయవాడ-విశాఖపట్నం (12718) ఎక్స్‌ప్రెస్, విశాఖ- విజయవాడ (12717) ఎక్స్‌ప్రెస్, విశాఖ-గుంటూరు (22701) ఎక్స్‌ప్రెస్, గుంటూరు-విశాఖ(22702) ఎక్స్‌ప్రెస్, గుంటూరు-విశాఖ (17239) ఎక్స్‌ప్రెస్, విశాఖ-గుంటూరు (17240) ఎక్స్‌ప్రెస్, విజయవాడ- రాజమహేంద్రవరం (07768) రైలు, రాజమహేంద్రవరం-విశాఖ (07466) రైలు, విశాఖ-రాజమ హేంద్రవరం (07467) రైలు మొత్తం 10 రైళ్లు ఈ నెల 30న రద్దు చేశారు. విశాఖ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే(17240) రైలు అక్టోబరు 1న రద్దు చేసినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. వివరాలకు సమీప రైల్వేస్టేషన్‌లోని బుకింగ్ కార్యాలయంలో సంప్రదించాలని పీఆర్వో మండ్రూప్‌కర్ తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో
ఆహార భద్రతా అధికారులు శాంపిల్స్ సేకరణ

అన్నవరం, సెప్టెంబరు 22: అన్నవరం దేవస్థానంలో అన్నదానం, ప్రసాదం తయారీకి వినియోగించే ముడిపదార్థాలైన నెయ్యి, పప్పుదినుసులు, పంచదార తదితర పదార్థాలను ఆహార నియంత్రణ అధికారులు ఆదివారం శాంపిల్స్ సేకరించి తీసుకెళ్లారు. వీటిని తమ ఉన్నతాధికారుల ఆదేశాలతో ల్యాబ్‌కు పంపించి నాణ్యత పరిశీలిస్తామని ఈ నమూనాల ల్యాబ్ రిపోర్టుకు సుమారు 20 రోజుల సమయం పడుతుందని ఆహారభద్రత నియంత్రణ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పేర్కొన్నారు. ప్రాథమిక పరిశీలనలో అంతా సవ్యంగానే ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నమూనాల పరీక్షలకు ఎక్కడికి పంపాలి అనేది తమ ఉన్నతాధికారులు నిర్ణయిస్తారని అన్నారు.

సత్యదేవుడికి వేడుకగా రథసేవ



అన్నవరం, సెప్టెంబరు 22: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవ అయిన రథసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను టేకు రథంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ తూర్పురాజగోపురం చుట్టూ ముమ్మార్లు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్ ఐ.వి.రామారావు, సి.సి టు ఛైర్మన్ అత్తి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తింటే రోగాలే!



కుళ్లిన కోడిగుడ్లు, మసాల పెట్టి నిల్వచేసిన పాడైన చికెన్ (ఫైల్)

- బయట ఫుడ్ నో సేఫ్
- 80 శాతం అనారోగ్యాలకు అదే కారణం
- హోటల్స్, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత తనిఖీలు పత్తాలేదు
- జిల్లా వ్యాప్తంగా పైసా వసూళ్లు ● కానరాని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు22: నేటి ఆధునిక యుగంలో అందరూ క్షణం తీరిక లేకుండా రోజులు గడిపేస్తున్నారు. ఈ క్రమంలో ఇంట్లో వండుకుని తినే పరిస్థితులు లేక నూటికి 60శాతం మంది బయటే ఆహారం తీసుకుంటున్నారు. ఇది వారి ఆరోగ్యానికి సేఫ్‌కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బయట ఆహారం అనారోగ్యకరమని అనేక సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. కొంత మంది ఉద్యోగాలు, వృత్తుల రీత్యా ఇంట్లో వండిన భోజనాలు తినే పరిస్థితిలేక బయట హోటల్స్ రెస్టారెంట్లను ఆశ్రయిస్తుంటారు. కొన్ని హోటల్స్, రెస్టారెంట్లలో ఆహార నాణ్యతను పరిశీలిస్తే అనేక దారుణ విషయాలు బయటకు వస్తున్నాయి. పాడైన మటన్, చికెన్, చేపలు, గుడ్లు వంటి వాటిని ఫ్రిజ్‌లలో నిల్వలు చేసి వాటిని డ్రైచేసి మసాలా బాగా దట్టించి కూరలలో వినియోగించి వినియోగదారులకు అందిస్తున్నారు. వాటివల్ల అనేక రోగాలబారినపడే ప్రమాదం ఉంది. వినియోగించే వంట నూనెలను వారాల తరబడి వాడిందే వాడుతున్నారు. దీనివల్ల అందులో ఉడికిన పదార్థాలుఅనారోగ్య కారకాలుగా మారతాయి.

తనిఖీలకు ప్రత్యేక టాస్క్‌ఫోర్సును నియమించాలి

● గొట్టిముక్కల అనంతరావు, జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు



ఆహార తయారీ కేంద్రాలు, ప్రభుత్వ ప్రైవేట్ హాస్టల్స్‌లో కూడా ఆహార తనిఖీలు చేపట్టాలి. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులతో పాటు కొన్ని రెస్టారెంట్లను తనిఖీ చేసి కేసులు కూడా పెట్టించాం. డీసీపీసీ సమావేశంలో కూడా జిల్లా కలెక్టర్‌ను ఆహార తనిఖీలకు చర్యలు తీసుకోవాలని కోరాం. సిబ్బంది కొరత అని ఫుడ్ సేఫ్టీ అధికారులు చెబుతున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. తనిఖీల కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్సును నియమించాలి. రాజమహేంద్రవరంలో రెస్టారెంట్లపై అనేక ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి.

నాణ్యతలేని ఆహారంవల్ల వచ్చే వ్యాధులు

బయట నాణ్యతలేని ఆహారం తీసుకోవడం శరీరంలో బ్యాక్టీరియా పెరుగుతోంది. కడుపునొప్పి, వాంతులు విరేచనాలు, అతిసార వ్యాధి, అధిక రక్తపోటు, గుండెపోటు, అజీర్ణం, గ్యాస్ నొప్పులు, టైఫాయిడ్, దద్దుర్లు, శ్వాస సమస్యలు, కండరాలవాపు, రక్తనాళాల సమస్యలు, ఇన్సులిన్ నిరోధకత, టైప్2 మధుమేహంవంటి జబ్బులబారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

80 అనారోగ్య సమస్యలు

సహజంగా ప్రకృతి సిద్ధమైన ఆహారం తాజా కూరగాయలు, నాణ్యతతో కూడిన పండ్లు, ఆహార పానీయాలు అప్పటికప్పుడు తయారుచేసి తీసుకోవడంవల్లన మనిషి ఆరోగ్యంగా జీవనం సాగిస్తుంటాడు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కంగారుగా హోటల్‌కి పోవడం నచ్చింది ఆర్డర్ చేసేయ్యడం, వచ్చిన వెంటనే బుజించడం ఇది ఇప్పటి ట్రెండ్, బాగా రోస్ట్ చేయించుకుని నచ్చిన రెసిపీలో తినేయడమే దానివెనుక దాగివున్న ప్రమాదాలు ప్రస్తుత యువతరానికి కనిపించడం లేదు. వేడివేడి కూరలు కవర్ ప్యాకింగ్ చేస్తే ఆ ప్లాస్టిక్ వాటిలో కరిగితే అది తింటే ఏమౌతుందో అనే భయం కూడా లేని పరిస్థితి. ఒంట్లో సమస్యలు వచ్చి అది రోగాలకు దారి తీసినప్పుడు మాత్రం అప్పుడు దాని కోసం ఆలోచించే పరిస్థితులు ప్రస్తుత సమాజంలో కనిపిస్తున్నాయి. మందు, గుట్కా, సిగరెట్ వంటి మాదక ద్రవ్యాలు తీసుకుంటేనే క్యాన్సర్ బారిన పడినట్లు కాదు. ఈవేమీ తీసుకోకుండానే కొన్నిరకాల నాణ్యతలేని ఆహారం తీసుకోవడంవల్ల కూడా క్యాన్సర్, లివర్, జీర్ణాశయం వ్యాధుల బారిన పడతారంటే అతిశయోక్తికాదు. ఇలా నాణ్యతలేని ఆహారం భుజించడం ద్వారా 80 శాతం అనారోగ్య సమస్యలు వస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



హోటల్ కిచెన్‌లో గోదుమ రంగులోకి మారిన ఆయిల్ (ఫైల్)

హోటల్స్, రెస్టారెంట్లలో నామమాత్రపు తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా కొన్నివేల హోటల్స్, రెస్టారెంట్లు, చిన్నాచితకా డాబాలు, ఫుడ్ కోర్టులు ద్వారా లక్షలాది మంది ప్రజలు ఆహారం తీసుకుంటున్నారు. వారికి నచ్చిన ఫుడ్‌ను ఆర్డర్ చేసుకుని మరీ తింటున్నారు. కొన్ని హోటల్స్ రెస్టారెంట్లలో కిచెన్‌లో పరిస్థితి వచ్చిన కస్టమర్‌కు తెలియదు, బయట హడావిడిగా షోయింగ్ పడిపోతాడు. లోపల ఫ్రిజర్‌లో ఎలాంటి ఆహారం నిల్వవుంది. వాటి నాణ్యత ఎలావుంది, వంట తయారీకి ఎటువంటి ఆయిల్ వినియోగిస్తున్నారు అనేది వినియోగదారుడికి తెలియదు, లోపలకి వెళ్లి చూసే పరిస్థితి కూడా ఉండదు. దీంతో లాభాపేక్షతో కొందరు రెస్టారెంట్, ఫుడ్ కోర్టుల నిర్వాహకులు ఆహార నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి ప్రజల ఆరోగ్యాలతో ఆటాడుకుంటున్నారు. కనీసం నెలనెలా రెస్టారెంట్లను, హోటల్స్‌ను, ఫుడ్‌కోర్టులను సంబంధిత అధికారులు తనిఖీలు చేసే పరిస్థితులు కూడా లేకపోవడంతో పరిస్థితి దారుణంగా మారిపోయింది. ఇటీవల విజిలెన్స్ ఎస్పీ నేరుగా తనిఖీలు చేసిన పరిస్థితి కూడా చూశాం. విజిలెన్స్ తనిఖీ తర్వాత నగరపాలక సంస్థ 3 బృందాలను ఏర్పాటుచేసి తనిఖీలపై దృష్టిపెట్టింది. కొన్నిచోట్ల ఉన్న రెస్టారెంట్లు, హోటల్స్‌లో తాజా నూనెలు వినియోగించడం లేదు. నూనెలో యాడిటివ్స్, ప్రిజర్వేటివ్స్, కలుషితాలతో ఉండకూడదు. నూనెలో టోటల్ పోలర్ మెటీరియల్ శాతం 25 మాత్రమే ఉండాలి. కానీ రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి లాంటి ప్రాంతాల్లోని కొన్ని హోటల్స్‌లో 60 నుంచి 70 శాతం ఉంటుంది. దీనిలో ఉడికించిన ఆహార పదార్థాలు స్వీకరిస్తే క్యాన్సర్ వస్తోంది. నూనెలు వింతవాసన వచ్చిన, గోదుమ రంగుల్లోకి వచ్చిన వాటిని వినియోగించరాదు. దాదాపు అన్నిచోట్ల నూనెలను దారుణంగా నలుపురంగు వచ్చేవరకు వాడుతున్నారు. తనిఖీల ప్రక్రియ నిరంతరం కొనసాగడంలేదు. ఏదొక సీజన్‌లో తనిఖీలుచేసి ఆటుపై మొద్దునిద్రలో సంబంధిత అధికారులు ఉంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా నిర్లక్ష్యం వెనుక కారణాలేమిటో?

జిల్లాలో 19 మండలాలు ఉన్నాయి. వాటిలో రాజమహేంద్రవరం కార్పొరేషన్ కాగా, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలుగా ఉన్నాయి. మిగిలిన ప్రాంతాలు నగర పంచాయతీలు, గ్రామ పంచాతీలుగా ఉన్నాయి. రాజమహేంద్రవరంలో 5 స్టార్ హోటల్స్ మొదలుకొని, రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టులు, భోజనం హోటల్స్ అనేకం ఉన్నాయి. అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు ప్రాంతాల్లో కూడా హోటల్స్ ఉన్నాయి. ఆయా హోటల్స్, రెస్టారెంట్లను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కనీసం పట్టించుకోవడం లేదు. దీనివెనుక అనేక ఆరోపణలు వస్తున్నాయి. మామూళ్ల మత్తులో ఉన్న కొంతమంది అధికారులు అండగా ఉండడంతో ఆహార భద్రత, నాణ్యత చట్టాలకు తిలోదకాలు ఇస్తున్నారు. ఒకవేళ దాడులు చేసినా తీసుకున్న శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపిస్తారు కానీ వాటి రిపోర్టు రాదు, తదుపరి చర్యలు ఉండవు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు లేకపోతే..

● కాల్ 9989688699: ఏఎఫ్‌సీ శ్రీనివాస్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్(ఏఎఫ్‌సీ) బి.శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆహారంలో విషయంలో నాణ్యతా ప్రమాణాలు లేవని గమనిస్తే వెంటనే జిల్లా ఆహార భద్రతా అధికారి 9849848070, తన నెంబరు 9989688699కి ఫోన్‌చేయాలని ఆయన సూచించారు. రాజమహేంద్రవరంలోని ఆదివారం పలు రెస్టారెంట్లు, ఈట్‌స్ట్రీట్‌లో తనిఖీలు నిర్వహించారు. వంటకాల్లో వినియోగించే సరుకులు, పెరుగు తదితర పదార్థాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కి పరీక్షల నిమిత్తం పంపించామన్నారు. కొన్నింటిలో నిబంధనల ఉల్లంఘనలు గమనించి అక్కడికక్కడే జరిమానాలు విధించా మన్నారు. మంజీర, షెల్టన్, శ్రీకన్య, సితార, ఈట్‌స్ట్రీట్‌లోని ఫుడ్ స్టాల్స్‌లో విస్తృతంగా తనిఖీలు చేశామని శ్రీనివాస్ తెలిపారు. ఈట్‌స్ట్రీట్‌లోని ఫుడ్ స్టాల్స్‌లో వంటనూనె టీపీసీ రీడింగ్ నిబంధ నల ప్రకారం ఉండకపోవడంపై కేసు నమోదు చేశామన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో కచ్చితంగా పరిశుభ్రత పాటించాలన్నారు. తనిఖీల్లో జిల్లా ఆహార భద్రతా అధికారి వి.రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



వంటశాలల్లో ఆయిల్‌ను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

మస్కట్ రోడ్డు ప్రమాదంలో
నిడదవోలు యువకుడు మృతి

- స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం ● కంసాలిపాలెంలో విషాదఛాయలు



మస్కట్ నుంచి వచ్చిన మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో అవిటి రాజు (ఫైల్)

నిడదవోలు, సెప్టెంబరు 22: ఆ ఇంటి పెద్ద కొడుకుగా ఇంటి బాధ్యతలను భుజానికి ఎత్తుకుని తల్లిదండ్రులను తమ్ముడిని బాగా చూసుకోవాలనే తపనతో ఉపాధి కోసం మస్కట్ వెళ్లాడు. ఆ యువకుడు నేడో రేపో తిరిగి వస్తాడని ఆశతో ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు అక్కడ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెంది మృతదేహం ఇంటికి రావడం ఆ కుటుంబాన్ని తీవ్రంగా కలచివేసింది. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరిజిల్లా నిడదవోలు మండలం కంసాలిపాలెం గ్రామానికి చెందిన అవిటి రాజు (24) సుమారు మూడేళ్ల క్రితం ఉపాధి కోసం మస్కట్‌కు వెళ్లాడు. తల్లిదండ్రులకు తమ్ముడికి అన్నీ తానై చూసుకొంటున్న అవిటి రాజు మస్కట్‌లో గతవారం రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. రాజు మృతి చెంది వారంరోజులు అయినా అనారోగ్యంతో ఉన్న అతని తల్లి ఎక్కడ ఆందోళన చెందుతుందో అని బంధువులు గ్రామస్తులు తల్లిదండ్రులకు తమ్ముడికి తెలియకుండా ఉంచారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడని చికిత్స పొందుతున్నాడంటూ శనివారం వారికి సూచాయగా చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున మస్కట్ నుంచి రాజు మృతదేహం బంధువులు గ్రామానికి చేర్చారు. తమ బిడ్డ లేడన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ్ముడు బాధ వర్ణనాతీతం. నేడో రేపో తిరిగి వస్తాడని రాజుకు వివాహం చేయాలనే ఆలోచనలో ఉన్న కుటుంబానికి రాజు మృతదేహం రావడంతో వారి రోదనలు మిన్నంటాయి. గ్రామస్తులు సైతం రాజు మృతిపట్ల విషాధంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి



సంఘటనా స్థలంలో మృతి చెందిన గోవిందు

తునిరూరల్, సెప్టెంబరు 22: రోడ్డు ప్రమాదంలో అన్నవరం దేవస్థానానికి చెందిన ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట గ్రామానికి చెందిన ఎలుగు గోవిందు(26) అన్నవరం దేవస్థానంలో విధులు ముగించుకుని సైకిల్‌పై తేటగుంట గ్రామానికి వస్తుండగా 16వ నెంబరు జాతీయ రహదారి పాత ఆర్టీవో చెక్‌పోస్టువద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో తుని రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికిచేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలోఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తిస్తామని తునిరూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ కృష్ణమాచార్య తెలిపారు.

దుర్వాసనను భరించలేకపోతున్నాం

- అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ఎదుట స్థానికుల ఆందోళన
- పెట్రోల్ బాటిల్‌తో యువకుడి హల్‌చల్



అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ముందు ఆందోళన చేస్తున్న స్థానికులు

గోకవరం, సెప్టెంబరు 22: తూర్పుగోదావరిజిల్లా గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామ సమీపంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామంటూ స్థానికులు ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. పరిశ్రమ ప్రధానగేటువద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుర్వాసనతో శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదుర వుతున్నాయని, పెద్దపెద్ద శబ్దాలు వెలువడుతుండడంతో పిల్లలు నిద్రపోవడం లేదంటూ ఆగ్రహవేశాలు వ్యక్తం చేశారు. పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థ నీటిని ఏవిధంగా ఎక్కడికి తరలిస్తున్నారనే విషయంపై కూడా యాజమాన్యం ప్రజలకు వివరించాలని పట్టుబట్టారు. ఈ విషయంలో రివర్స్ బోరింగ్ పద్ధతిని చేపడుతున్నారనే అనుమానాలు ఉన్నాయన్నారు. గతంలో అనేకమార్లు ఇదే విషయంపై యాజమాన్యాన్ని నిలదీసినప్పటికీ వారిలో ఏమాత్రం మార్పు రాలేదని ఆవేదన చెందారు. ఈక్రమంలో ఓ యువకుడు తమకు న్యాయం చేసే వరకు పరిశ్రమలో జరిగే కార్యకలాపాలను నిలిపివేయాలంటూ పెట్రోల్ బాటిల్‌తో హల్‌చల్ చేయడంతో అక్కడ వాతావరణం మరింత వేడెక్కింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో చర్చించారు. యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. తమ సమస్యను త్వరగా పరిష్కరించకపోతే పరిశ్రమ ముందు భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని గ్రామస్థులు హెచ్చరించారు. కార్యక్రమంలో మండలంలోని గుమ్మళ్ళదొడ్డి, బావాజీపేట, వెదురుపాక గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జిల నియామకం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 22: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్రంలోని 25జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించింది. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పరిధిలో కొత్త ఇన్‌చార్జిలు నియమితులయ్యారు. కాకినాడ జిల్లా ఇన్‌చార్జిగా మేడ సురేష్, కోనసీమ జిల్లా ఇన్‌చార్జిగా జగత శ్రీనివాస్, రాజమహేంద్రవరం జిల్లా ఇన్‌చార్జిగా కొలనుకొండ శివాజీలను నియమించారు.

శెట్టిబలిజ సంఘం సమావేశం రసాభసా

● ఇరువర్గాలు .తోపులాట ....చెదరగొట్టిన పోలీసులు



సమావేశంలో ఇరువర్గాల తోపులాట దృశ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 22: రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘం సమావేశం ఆదివారం ఉద్రిక్తతల నడుమ రసాభసాగా ముగిసింది. మధ్యాహ్నం తాలూకా శెట్టిబలిజ సంఘ సమావేశం ప్రారంభమైంది. శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికకు ఎంపీ బోస్ సారథ్యంలో మాజీ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో ఎంపీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతుండగా మంత్రి సుభాష్ వర్గానికి చెందిన శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు గతంలో ప్రకటించిన దొంగల శ్రీధర్ మద్దతు దారులు బోస్ ప్రసంగానికి అడ్డుతగిలారు. బోస్ గో బ్యాక్, బోస్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ దశలో బోస్ వర్గీయులు పోటీగా నినాదాలు చేశారు. ఇరువర్గాలు తోపులాట జరిగే పరిస్థితి నెలకొంది. దీంతో డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ అశోక్‌కుమార్‌తో పాటు మరో ముగ్గురు సీఐలు, ఎస్‌ఐలు పోలీసు సిబ్బంది రంగ ప్రవేశం చేశారు. ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో ఇరువర్గాలు పరుగులు తీశారు. దీంతో సమావేశం నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎంపీ బోసు ప్రకటించారు. ఎన్నికలను కొన్నిశక్తులు అడ్డుకుంటున్నాయని అన్నారు. శెట్టిబలిజ సంఘం తాత్కాలిక అధ్యక్షుడిగా పనిచేసి రాజీనామా చేసిన నరాల ఏడుకొండలు అధ్యక్షుడిగా, పలివెల నాగరాజు కార్యదర్శిగా కొనసాగుతారని బోస్ ప్రకటించారు. శాంతియుత వాతావరణం ఏర్పడేవరకు కొనసాగుతారని తెలిపారు.

అందరి సమక్షంలోనే ఎన్నికయ్యాం

దొంగల శ్రీధర్ మాట్లాడుతూ ఇటీవల సంఘం సమావేశం ఏర్పాటుచేసి తాలూకా శెట్టిబలిజ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని అందులో అధ్యక్షుడిగా తనను, కార్యదర్శిగా కోట శ్రీనివాసరావుతోపాటు పార్టీలకతీతంగా కార్యవర్గం ఎన్నుకున్నారన్నారు. ఎంపీ బోస్ సంఘంలో విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో టేకుమూడి సత్యనారాయణ, పలివెల నాగరాజు, కాలా సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

వరద నుంచి బయటపడ్డ
గండిపోశమ్మ అమ్మవారు



గండిపోశమ్మ అమ్మవారి విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

దేవీపట్నం, సెప్టెంబరు 22: గత మూడు నెలల నుంచి వరద నీటిలో ఉండిపోయిన మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం ఆదివారం బయటపడింది. అమ్మవారి ఆలయం శుభ్రం చేసేందుకు తలుపులు తెరవగా అమ్మవారి తలపై నాగుపాము నాట్యమాడి మాయమైనట్లు పూజారి తెలిపారు. ఆలయ అధికారులు అమ్మవారి ఆలయంలో బురదను తొలగించారు. అమ్మవారి విగ్రహాన్ని శుభ్రపరుస్తున్నారు. ప్రతీ ఏడాది వరద సమయంలో అమ్మవారి ఆలయం నెలలు తరబడి ముంపులోనే ఉండడంతో మైదాన ప్రాంతాల నుంచి దర్శనం కోసం వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పోశమ్మగండి ఆలయం వరద ముంపు బారిన పడకుండా ఆలయం నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా వేణుగోపాలకృష్ణ



పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడుతున్న వేణు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 22: వైసీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మండలంలోని బొమ్మూరులో పార్టీ కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి లడ్డూ తయారీ విషయంలో భక్తుల మనోభావాలపై చంద్రబాబు దారుణమైన నింద వేశారన్నారు. అదే విషయమై సీబీఐతో విచారణ చేయించాలన్నారు. నిల్వ ఉంచిన ఇసుకను దొంగలించిన టీడీపీ నేతలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లపై పలు విమర్శలు చేశారు. ఈ సందర్భంగా వేణుకు పార్టీ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, గూడూరి శ్రీనివాస్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు, సెప్టెంబరు 22 : గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని పిండాలరేవు వద్ద గోదావరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలుతుందని సమాచారం రావడంతో పట్టణ ఎస్‌ఐ కె.జగన్మోహనరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గోదావరి నుంచి మృతదేహాన్ని బయటకు తీయించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. 60 నుంచి 65 సంవత్సరాలు ఉంటుందని, అతని ఒంటిపై సిమ్మెంటు రంగుపై తెలుపు నిలువు చారలు కలిగిన పొడుగు చేతుల చొక్కా ధరించి, గెడ్డం మాసి ఉందన్నారు. ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు, సెల్ 9440796622కు సమాచారం అందించాలన్నారు. దీనిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

- కాకినాడ టీటీ అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌బాబు
- శ్రీప్రకాష్‌లో ఘనంగా ముగిసిన క్లస్టర్ లెవెల్ టీటీ పోటీలు



టీటీ పోటీల్లో గెలుపొందిన విజేతలు

పెద్దాపురం, సెప్టెంబరు 22: బాల్యం నుంచి క్రీడలపై మక్కువను పెంచుకోవాలని, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని కాకినాడ టీటీ అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌బాబు పేర్కొన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న క్లస్టర్ లెవెల్ సీబీఎస్‌ఈ టేబుల్ టెన్నిస్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ఆదివారం హాజరయ్యారు. ముందుగా ఆయనకు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ సాదరంగా ఆహ్వానం పలికారు. అలాగే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడు తూ పెద్దాపురం పట్టణంలో క్లస్టర్ స్థాయిలో టీటీ పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్ణయించుకోవా లని, అలాగే క్రీడలపట్ల మక్కువను పెంచుకోవాలన్నారు. సాటిమేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నారు. టీటీ ఇంటర్‌నేషనల్ కోచ్ సురేష్ మాట్లాడుతూ క్రీడల్లో విజయం సాధించాలంటే అహర్నిశలూ సాధన చేయాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో టీటీ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గతంలో తమ పాఠశాలలో జాతీయస్థాయిలో టీటీ పోటీలు కార్యక్రమానికి వేదిక అయ్యిందని గుర్తుచేసుకున్నారు. కాకినాడ టీటీ వైస్ ప్రెసిడెంట్ దంటు భాస్కర్ మాట్లాడుతూ క్రీడాకారులు అంతా చక్కని ప్రతిభను కనభరిచారని, గెలుపు, ఓటములు సర్వసాధారణమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల జాయింట్ సెక్రటరీ సీహెచ్ సమీర, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్‌మూర్తి, రమణకుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.





భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు, క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

తలుపులమ్మా కరుణించమ్మా!

● లోవ ఆలయానికి రూ.3.64లక్షల ఆదాయం

తుని రూరల్, సెప్టెంబరు 22: తూర్పు కనుమల్లో కొలువై తలంపులమ్మగా మహిమలు విరాజిల్లుతున్న లోవ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. లోవకు కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన వంట షెడ్‌లతోపాటు వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజే అమ్మవారిని 20వేల మంది భక్తులు దర్శించుకోగా వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.3.64లక్షలు సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాద్‌రాజు తెలిపారు.

ఏజెన్సీ సమాచారం

జాతీయస్థాయిలో నీతి అయోగ్ వర్క్‌షాప్‌కు
వై.రామవరం మండలం ఎంపిక

● నేడు ఢిల్లీకి ఎంపీడీవో బాపన్నదొర



వై.రామవరం, సెప్టెంబరు 22: జాతీయస్థాయిలో నీతి అయోగ్ చేపడుతున్న సంపూర్ణత పోషణ అభియాన్ వర్క్‌షాప్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి అల్లూరి సీతారామరాజుజిల్లా వై.రామవరం మం డలం ఎంపికైంది. బ్రెయిన్ స్టార్మింగ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌పై నేడు న్యూఢిల్లీలో జరుగనున్న వర్క్‌షాప్‌కు భారత దేశం నుంచి పలు రాష్ట్రాల నుంచి అధికారులు హాజరుకానుండగా ఏపీ నుంచి వై.రామవరం ఎంపీడీవో కె.బాపన్నదొర అక్కడ జరిగే వర్క్‌షాప్‌కు హాజరుకానున్నారు. ఏజెన్సీ ప్రాంతమైన వై.రామవరం మండలంలో ఉన్న భౌగోళిక పరిస్థితులు అభివృద్ధికి కావలసిన అంశాలపై ఎంపీ డీవో బాపన్నదొర వివరించనున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వై.రామవరం మండలం ఈ వర్క్‌షాప్‌కు ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే శిరీషదేవి



ఏరియా ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

రంపచోడవరం, సెప్టెంబరు 22: మారేడుమిల్లి పర్యాటక ప్రాంతం జలతరం గిణి వాటర్ ఫాల్స్‌లో ఏలూరు ఆశ్రమ వైద్యకళాశాలకు చెందిన ఐదుగురు మెడికల్ విద్యార్థులు గల్లంతవ్వగా ఇద్దరు సురక్షితంగా బయట పడ్డారు. మిగతా ముగ్గురు కాలువలో కొట్టుకుపోయారు. బయటపడ్డ క్షతగాత్రులను రంపచోడ వరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పరామర్శించి అందుతున్న వైద్యసేవలను స్వయంగా పర్యవేక్షించారు. వీరికి మెరుగైన వైద్యసహాయంకోసం రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రికి తరలించేందుకు కావాల్సిన చర్యలను పర్యవేక్షించి విద్యార్థులకు తక్షణం వైద్య సహాయం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. గల్లంతైన ముగ్గురు విద్యార్థుల ఆచూకీ కోసం పోలీసు, అగ్నిమాపక సిబ్బందితో రిష్క్యూ ఆపరేషన్ చేపట్టినట్టు తెలిపారు.

సీబీఐతో విచారణ జరిపించాలి: శీతంశెట్టి

రంపచోడవరం, సెప్టెంబరు 22: తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో లడ్డు ప్రసాదం కల్తీ నెయ్యితో తయారు చేసిన బాధ్యు లపై సీబీఐతో విచారణ జరిపించాలని రంప చోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వర రావు అన్నారు. కోట్లాది మంది భక్తుల మనోభా వాలు దెబ్బతినేలా లడ్డు ప్రసాదం తయారీలో ఉపయోగించే కల్తీ నెయ్యి గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన నాయకులేనని, ఇందుకు బాధ్యులైన టీటీడీ ఉద్యోగులపై కూడా విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

గృహాల నష్టానికి రూ. పది వేలు

చింతూరు, సెప్టెంబరు 22 : వరద కారణంగా చింతూరు డివిజన్‌లో ముంపునకు గురై నష్టపోయిన ప్రతిఇంటికీ రూ.10వేలు వంతున నష్ట పరిహారం అందజేయనున్నట్లు అల్లూరి సీతారా మరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేదశలో నీట ముని గిన గ్రామాల ప్రజలకు జీవన భృతి కల్పిస్తామన్నారు. ఆ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ మేరకు సర్వే జరుగుతుంద న్నారు. సర్వేలో లోటుపాట్లు ఉంటే తహసీల్దార్, ఎంపీడీవోల దృష్టికి తీసుకురావాలన్నారు.

మావోయిస్టుల తీరుని నిరసిస్తూ ర్యాలీ



మావోయిస్టుల తీరుకు నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ యువత

చింతూరు, సెప్టెంబరు 22: మావోయిస్టుల తీరుని నిరసిస్తూ డివిజన్ కేంద్ర మైన చింతూరులో ఆదివారం ఆదివాసీ యువత ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మావోయి స్టులు బంద్‌లకు పిలుపునివ్వడంతో సాధారణ ప్రజాజీవితానికి ఆటంకం చోటుచేసుకుందన్నారు. ఆదివాసీలను హత్యచేస్తున్న మావోయిస్టులను ద్రోహులుగా గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. మావోయిస్టుల కారణంగా అభివృద్ధి ఆగిపోతుంద న్నారు. అభివృద్ధి పనులకు వినియోగించే యంత్రాలను సైతం మావోయిస్టులు తగుల బెడుతున్నారని వారు పేర్కొన్నారు. మన్యం అభివృద్ధికోసం పోలీసు అవుట్ పోస్టుల సంఖ్య పెంచాలని వారు డిమాండ్ చేశారు.

వరద బాధితులకు వంగడాల పంపిణీ

చింతూరు, సెప్టెంబరు 22: వరద బాధిత రైతులకు సాపిడ్ స్వచ్ఛంద సంస్థ ఉచితంగా వంగడాలను ఆదివారం చింతూరులో పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ మీరా ఖాదర్ మాట్లాడారు. వరద వచ్చిన ప్రతిసారి తమ సంస్థ రైతులకు వంగడాలు ఉచితంగా అందజేసి ఆదుకుంటామన్నారు. ఆయా వంగడా లతో రైతులు మంచి దిగుబడుల సాధించా మన్నారు. ఈఏడాది చింతూరు మండలంలో రెండు పర్యాయాలు వరద రావడంతో రైతులు నష్టపోయిన విషయం తెల్సిందే. దీంతో తమ సంస్థ ద్వారా 20 గ్రామాలకు చెందిన 600 మంది రైతులకు పెసర, మినుము, పెసర వం గడాలను ఉచితంగా అందజేశామన్నారు. ఉచిత వంగడాల పంపిణీకి తమ సంస్థకు అందేరిహిల్ఫ్ అనే మరో సంస్థ సహకారం అందించిందన్నారు. కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ ఎస్‌కే అహ్మద్ అలి, ఉర్మిదాస్, నాగరాజు, లక్ష్మీ, జానకి, మేరి, లక్ష్మిలు పాల్గొన్నారు.

వరద పరిహారం అర్హులందరికీ అందించాలి

చింతూరు డివిజన్‌లో వరద కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబానికి పరిహారం అందజేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య మం డల అధ్యక్షుడు డీవీఎస్ రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు పర్యాయాలు వరద రావడంతో లోతట్టు గ్రామాల ప్రజలకు జీవన భృతి లేకుండా పోయిందన్నారు. చిరు వ్యాపారులు సైతం వ్యాపారం నడవక నష్టపోయారన్నారు. ఇక రైతుల పరిస్థితి మరీ దయనీయమన్నారు. ఈ మేరకు ప్రతి బాధిత కుటుంబానికి రూ.10 వేలు వంతున నష్ట పరిహారం చెల్లించాలని వారు కోరారు.

ఆ పంచాయతీలోని ప్రజలకు
వరద నష్టపరిహారం లేనట్టేనా?

కూనవరం, సెప్టెంబరు 22: గడిచిన మూడు నెలల్లో ఇక్కడి ప్రాంత ప్రజలను మూడుసార్లు గోదావరి వరద ముంచెత్తింది. ఒకే నెలలో రెండుసార్లు వరదొచ్చింది. గోదావరి వరద మొదట వచ్చినసారి మండలంలో ప్రతీ ఇంటికీ ప్రభుత్వం వరద సాయం అందజేసింది. ప్రతీ కుటుంబానికి రూ.3వేలు ఇచ్చారు. ఇప్పుడు మాత్రం వరద నష్టం కొన్ని పంచాయతీలకే పరిమితం చేశారు. మండలంలో మొత్తం 16 పంచాయతీలున్నాయి. వీటిలో ఆభిచర్ల, కూటూరు, పెదఆర్కుర్, చూచిరేవుల, జగ్గవరం పంచాయతీలు ఈసారి వరద నష్టపరిహారం పొందే జాబితాలో లేవు. ముంపు కు గురైన గ్రామాలకు జలదిగ్బంధంలో ఉన్న గ్రామాలకు మాత్రమే పరిహారం ఇచ్చేందుకు అధికారులు జాబితా సిద్ధం చేస్తున్నారు. వరదల సమయంలో బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేసిన గ్రామాలకు మాత్రమే పరిహారం అం దుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వచ్చిన ప్రతీ వరదకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతీ గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. వరదల సమయంలో పనులు కూడా దొరకక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని ప్రతీ గ్రామానికి మొదటిసారి పరిహారం ఎలా ఇచ్చారో ఆదేవిధంగా అందజేయాలని జిల్లా కలెక్టర్‌ను ప్రజలు కోరుతున్నారు.

దుర్గమ్మ ఆలయంలో పాలరాట

రంపచోడవరం, సెప్టెంబరు 22: దేవి శరన్నవరాత్రులు పురస్కరించుకొని స్థానిక స్టేట్‌బ్యాంక్ సమీపంలో ఉన్న త్రిశక్తి స్వరూపిణి దర్గాపరదేవత ఆలయంలో ఆదివారం అర్చకులు లింగాల సీతారామాంజనేయ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో పాలరాట కార్యక్రమం నిర్వహించారు. అల్లూరి సీతారామారాజు మోటర్స్, ఓనర్స్, వర్కర్స్ యూనియన్, కాంట్రాక్టర్లు, శ్రీకనకదుర్గా తాపీ పనివార్ల సంఘం, భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శరన్నవ రాత్రులు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బాణసంచా విక్రయాలలో నిబంధనలు పాటించాలి

చింతూరు, సెప్టెంబరు 22: బాణా సంచా విక్రయాల విషయంలో విధిగా నిబంధనలు పాటించాలని చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివా రం ఒక ప్రకటన విడుదల చేశారు. బాణాసంచా విక్రయదారులు లైసెన్సు పొంది ఉండాలన్నారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. లైసెన్సు దుకాణం ముందు ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. ప్రతి దుఖాణంవద్ద అగ్నినిరోధక సిలెండర్లు కావాల్సిన నీరు, పొడి ఇసుక అందుబాటులో ఉంచుకోవాల్సి ఉందన్నారు.

వంద రోజుల్లోనే హామీల అమలు

» ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
» పలుచోట్ల ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాలు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 22: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ప్రాధాన్యతా క్రమంలో హామీలు నెరవేరుస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి అని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని ఆదివారం పలుచోట్ల నిర్వహించారు. ధవళేశ్వరంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గోరంట్ల విచ్చేసి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. గత వైసీపీ పాలకులు అభివృద్ధిని పక్కన బెట్టి వారి స్వలాభం కోసం పనిచేస్తూ అడ్డగోలుగా అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా స్థితికి తీసుకొచ్చారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తెచ్చేందుకు కృషిచేస్తున్నామన్నారు. అనంతరం స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ఆగ్రహం

ధవళేశ్వరంలో పారిశుధ్యం అధ్వానంగా వుందని, వెంటనే పరిస్థితులు మెరుగుపరచాలని, శుభ్రతను విధిగా పాటించాలని, పంచాయతీ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు విధులు సరిగా నిర్వర్తించకపోతే తొలగిస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడి నిధులు దుర్వినియోగం చేశారన్నారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.20 కోట్లతో అంచనాలు తయారు చేశామన్నారు. సచివాలయ సిబ్బంది కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పర్యవేక్షించలన్నారు.

కడియం: కడియపులంకలో దళితులతో జరిగిన సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు కాయల సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దళితులకు మేలు జరుగుతుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దళితుల అభ్యున్నతికి సూపర్ సిక్స్‌లో భాగంగా అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో కాయల సత్యనారాయణ, కనికెళ్ళ బుల్లియ్య విప్పర్తి శ్రీను, ప్రత్తి సూర్యప్రకాష్, శీలం గోపాలం, పల్లి సురేష్, వేములూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నుంచి రూ.50 వేల కోట్ల సాయం: నల్లమిల్లి

బిక్కవోలు, సెప్టెంబరు 22: మండలంలోని కొమరిపాలెంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేసి మాట్లాడారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం మంచిదని నిరూపించుకుందని, సీఎం చంద్రబాబు చొరవతో కేంద్రం నుంచి రూ.50 వేల కోట్ల సాయం పొందామన్నారు. రామవరం-రాయవరం రోడ్డుకు రూ1.50 కోట్లు, నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.14 కోట్ల నిధులు మంజూరు చేయించుకున్నామన్నారు. వివిధ ఆలయాల అభివృద్ధికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, సర్పంచ్‌ల సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పడాల రామారెడ్డి, డీవీఆర్, సత్తి దేవానందరెడ్డి, కూటమి నాయకులు తహశీల్దార్ రమణి, ఎంపీడీవో ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



రాజానగరం: తోకాడలో ఎమ్మెల్యే బత్తులకు స్వాగతం పలుకుతున్న స్థానికులు



ధవళేశ్వరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

ప్రజా శ్రేయస్సే కూటమి లక్ష్యం: బత్తుల

రాజానగరం, సెప్టెంబరు 22: మండలంలోని తోకాడ, మల్లంపూడి గ్రామాల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలంతా ఎదురేగి పూల వర్షంతో ముంచెత్తుతున్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకట రమణ చౌదరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



బిక్కవోలు: కొమరిపాలెంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

విశ్వబ్రాహ్మణుల సంక్షేమంపై చర్చించాలి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22: విశ్వబ్రాహ్మణులకు తగినంత పనులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వంతో చర్చించాలని ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొడుగు శ్రీను విజ్ఞప్తి చేశారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావును ఆయన కలిసి సమస్యలను వివరించారు. కూటమి ప్రభుత్వంపై విశ్వబ్రాహ్మణులు ఎంతో నమ్మకం పెట్టుకున్నారని చేతివృత్తులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు ఆలోచన చేయాలని కోరారు.

వెలమల సంక్షేమానికి కృషి చేస్తాం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

» వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘన సత్కారం



గజమాలతో ఎమ్మెల్యే వాసును సత్కరిస్తున్న వెలమ సంఘం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22: వెలమల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం చెరుకూరి కళ్యాణ మండపంలో ఆదివారం వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వాసును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విజయంలో వెలమలు కీలక పాత్ర పోషించారన్నారు. తన ప్రాణం ఉన్నంత వరకు టీడీపీలోనే వుంటానని ఆయన అన్నారు. తనను పార్టీ మారాలని ఎన్నికల ముందు తనపై, తన తండ్రిపై కేసులు పెట్టి వేధింపులకు గురిచేశారని, తన కుమారుడిని కూడా ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. వెలమలకు కళ్యాణ మండపం నిర్మాణంపై త్వరలో తీపి కబురు చెబుతామన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ వెలమలకు ఏదైనా సమస్య వస్తే దాన్ని పరిష్కరించే వరకు కృషి చేస్తానన్నారు. ఆదిరెడ్డి వాసును ఘనంగా సత్కరించాక, ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, చలుమూరు శ్రీనివాస్‌లను సత్కరించారు. వెలమ సంఘం కళ్యాణ మండపానికి సంఘం మాజీ అధ్యక్షుడు అల్లు బాబి లక్ష విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, మాజీ మంత్రి మరడాని రంగారావు, నాయకులు కిలపర్తి శ్రీనివాస్, కోళ్ళబాబు, బుజ్జి, ప్రదీప్, మదుసూదనరావు, బాబ్జి, బాబి పాల్గొన్నారు.

జీవో 85ను రద్దు చేసే వరకు న్యాయపోరాటం

» పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక
» డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వద్ద కొవ్వొత్తులతో నిరసన

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 22: పీహెచ్‌సీ వైద్యుల పీజీ విద్యకు ప్రతిబంధకంగా మారిన జీవో నెంబరు 85ను రద్దు చేసే వరకు తమ న్యాయపోరాటం ఆపేది లేదని జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక తెలిపారు. ఆదివారం రాత్రి బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వద్ద పీహెచ్‌సీ వైద్యులు కొవ్వొత్తులు చేతపట్టి నిరసన తెలిపారు. జీవో 85ను రద్దు చేయడంతో పాటు ఇతర డిమాండ్లకు ప్రభుత్వం లిఖితపూర్వకంగా జీవో జారీచేయాలని డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే ధర్నాలో భాగంగా చలో విజయవాడకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. కరోనా సమయంలో పీహెచ్‌సీ వైద్యులు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవలందించామన్నారు. ఆ సేవలు సైతం ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకుండా తమ డిమాండ్లను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. చర్చలకు పిలుస్తున్నారే తప్ప. స్పష్టమైన హామీలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన కోర్కెలు అమలు చేసే వరకు ఆందోళన కొనసాగుతుందని మౌనిక స్పష్టం చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు జిరాజుద్దీన్, షమ్మికుమార్, అనూష, హరిశ్చంద్రప్రసాద్, నవీన్, భావన, మేఘన తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులు చేతబట్టి నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ వైద్యులు

ఎంఎస్‌ఎంఈ ప్రోత్సాహాన్ని వినియోగించుకోవాలి


జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పీకేపీ ప్రసాద్, ఎంఎస్‌ఎంఈ డీఎఫ్‌వో డీవీఎస్ఆర్ మూర్తి సూచించారు. రాజమహేంద్రవరంలో సూర్యచంద్ర ఫర్నీచర్ క్లస్టర్ అసోసియేషన్, శ్రీమహాలక్ష్మి పల్స్‌మిల్స్ క్లస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంఎస్‌ఎంఈ క్లస్టర్ అవుట్ రిచ్ కార్యక్రమంలో వారు, ఎస్ఐడీబీఐ జనరల్ మేనేజరు వి.చంద్రమౌళి, అధికారులు టీ.విద్యాసాగర్, గోపి నమ్మి, ఎన్.అఖిల్ హాజరయ్యారు. బ్యాంక్ స్కీమ్‌లను మైక్రోసాఫ్ట్ టీమ్స్ ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో మహాలక్ష్మి పల్స్ మిల్స్ ఎండీ ఎస్‌కే ఈశ్వర్‌రెడ్డి, సూర్యచంద్ర ఫర్నీచర్ క్లస్టర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యిపై విచారణ జరపాలి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22: పవిత్రమైన శ్రీవారి ప్రసాద లడ్డూ తయారీకి కల్తీనెయ్యి వినియోగించడంపై విచారణ జరపాలని తాళ్లూరు మఠాధిపతి, భారతీయ ధర్మ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాద్ ఆచార్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాక్షాత్తూ సీఎం చంద్రబాబు దీనిపై ప్రకటన చేయడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు మానసిక ఆందోళనకు గురిచేసిందన్నారు. ఇంతటి ఘోర అపచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

పీవీఎస్‌కు కళారత్న బిరుదు ప్రదానం



రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 22: జిత్ మోహన్‌మిత్ర చేసే కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న కృష్ణారావుకు కళారత్న, ఏసుబాబుకు కళాబంధు బిరుదులిచ్చి సత్కరించడం అభినందనీయమని కుందా మాస్టారు అన్నారు. స్థానిక గోకవరం బస్టాండ్ దగ్గరలోని జిత్‌మోహన్ మిత్ర కళావేదికపై ఆదివారం సాయంత్రం నటగాయకుడు జిత్‌మోహన్ మిత్ర అధ్యక్షతన కళావేదిక 21వ వార్షికోత్సవం నిర్వహించారు. కుందా మాస్టారు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమానికి సీహెచ్ విశ్వనాథ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. నిమ్మలపూడి గోవింద్, గుమ్మడి సమర్పణరావు, బి.సీతారామారావు, వి.జగపతి, జె.శివప్రసాద్, ఏఎస్ ఆనంద్, సుక్కిరెడ్డి శ్రీనివాసరావు అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా పీవీఎస్ కృష్ణారావుకు కళారత్న బిరుదు ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం జిత్‌మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా 54వ వార్షికోత్సవం సందర్భంగా గాన గంధర్వ ముఖేష్ అవార్డుని సీనియర్ గాయకుడు వీణం భాస్కర కోటేశ్వరరావుకి అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో శిష్టికరణ సేవాసమితి అధ్యక్షుడు శ్రీనివాసరావు, పి.గంగాధర్, బి.ఆనంద్‌కుమార్, గుంటూరి శ్రీనివాస్, పిచ్చుక మహేష్‌బాబు, బషీర్ పాల్గొన్నారు.

చెరువులో పడిన వ్యక్తి మృతదేహం లభ్యం

కోరుకొండ, సెప్టెంబరు 22: కోటికేశవరంలోని చెరువులో ప్రమాదవశాత్తూ మునిగిపోయిన కడుగుల అమ్మిరాజు(40)మృతదేహం లభ్యమైంది. శనివారం చేపట్టిన గాలింపు చర్యలు ఆదివారం కూడా కొనసాగించారు. ఈ క్రమంలో శవమై తేలాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వానికి తరలించారు. కోరుకొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే నానాజీ అనుచరులను శిక్షించాలి

అఖిల భారత రైతు కూలీ సంఘం

రాజానగరం, సెప్టెంబరు 22: కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావుపై దాడికి పాల్పడిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అనుచరులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జె.సత్తిబాబు, వెంకట్‌నాయుడు డిమాండ్ చేశారు. ఒక ప్రజాప్రతినిధిగా ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన ఎమ్మెల్యే వాలీబాల్ ఆటకు అనుమతి కోసం తన అనుచరులతో కలిసి ఉమామహేశ్వరరావుపై నోటికొచ్చిన బూతులు తిడుతూ చంపేస్తానని బెదిరించి దాడి చేయడాన్ని ఏఐకేఎంఎస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇటువంటి అధికార నేరానికి పాల్పడిన ఎమ్మెల్యే నానాజీపై, తన అనుచరులపై అట్రాసిటీ, వివిధ సెక్షన్లతో కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.

'హౌసింగ్‌బోర్డు కాలనీకి
కార్పొరేషన్ అధికారిని నియమించాలి'

దివాన్‌చెరువు, సెప్టెంబరు 22: నగరపాలక సంస్థలో విలీనం చేసిన తమ గ్రామానికి సంబంధించిన పరిపాలన పరమైన వ్యవహారాలు నిర్వహించేందుకు నగరపాలక సంస్థ నుంచి అధికారిని నియమించాలని లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీ మాజీ ఎంపీటీసీ రాయుడు శ్రీనివాసరావు, టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి కాదా ఈశ్వరరావు కూటమి నాయకులు వరప్రసాద్, కాళ్ల చక్రరావు, మేగం కిషోర్, బాబి, కుంపట్ల రామకృష్ణ, ఆర్.రవికిరణ్, వెంకటేష్ రాజమహేంద్రవరం కార్పొరేషన్ అధికారులను కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ తమ గ్రామం రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో విలీనమై రెండేళ్లయినప్పటికీ ఇంతవరకూ గ్రామానికి సంబంధిత కార్యాలయానికి చెందిన అధికారిని ఎవరినీ డిప్యూట్ చేయలేదన్నారు. దీంతో గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఎవరిని సంప్రదించాలో తెలియడం లేదని చెప్పారు. ఇంటి పన్నులు మాత్రం బాగా పెంచేశారని వాపోయారు. తమ గ్రామాన్ని కార్పొరేషన్ నుంచి విభజించి పంచాయతీగానే కొనసాగించాలని వారు కోరారు.

ఘనంగా ప్రపంచ నదుల దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22: రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో గోదావరి నదిని పూజిస్తూ ప్రపంచ నదుల దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు మద్దుల వీఎస్ శ్రీరామగుప్త అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోదావరి మాతకు పుష్పమాల సమర్పించి, పూజించారు. దీనికి ముఖ్యఅతిథిగా లయన్ పూర్వ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు విచ్చేసి నదిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం గోదావరిలోకి దిగి నగరానికి తాగునీటి అవసరాలు తీరుస్తున్న గోదావరిని పరిరక్షించుకోవాలని, నది కాలుష్యాన్ని నివారించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వెన్నా కుమారస్వామి, గ్రంధి వసంతకుమారి, రాఘవరావు, బుచ్చిరాజు, మాధవరావు, బాస్కరరావు, మృత్యుంజయం పాల్గొన్నారు.

కొంకుదురులో మహాన్నదానం

బిక్కవోలు, సెప్టెంబరు 22: కొంకుదురు మార్కెట్ సెంటర్‌లో చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మహాన్నదానాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చిన్నం వీరభద్రారెడ్డి ఆధ్వర్యంలో పలువురు దాతల సహకారంతో ఈ అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ద్వారంపూడి వెంకటరెడ్డి, కర్రి రామారెడ్డి, మల్లిడి బాబ్జి పాల్గొన్నారు.

ఈ-డిస్ట్రిక్టు మేనేజర్ పోస్టు భర్తీకి
దరఖాస్తుల ఆహ్వానం: కలెక్టర్



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 22: జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఈ-డిస్ట్రిక్టు మేనేజర్ పోస్టు భర్తీ కోసం ఆసక్తి, అర్హతలు కల్గిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ దరఖాస్తు చేసుకోవడానికి బీసీఏ / బీఎస్సీ / బీఈ / బీటెక్ / మాస్టర్స్ డిగ్రీ పాస్ అయి ఉండి, ఐటీ సెక్టార్‌లో రెండేళ్ల అనుభవం కల్గి ఉండాలని, ఆగస్టు 31వ తేదీ నాటికి 21-35 సంవత్సరాల వయస్సు కల్గి ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 11గంటల నుంచి అక్టోబరు 2వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తులు అందజేయాలని, నోటిఫికేషన్, దరఖాస్తు నమూనా www.eg.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చునన్నారు.

స్వర్ణాంధ్ర 2047 సాధనలో భాగస్వాములవ్వండి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్,సెప్టెంబరు 22: స్వర్ణాంధ్ర-2047 కోసం ప్రజలు, విజ్ఞులు, విభిన్న రంగాల్లో విశిష్ట ప్రతిభ చూపే వ్యక్తులు సంస్థల తరపున ప్రతినిధులు, విద్యార్థులు తమ అమూల్యమైన సూచనలు సలహాలు ఇవ్వడం ద్వారా స్వర్ణాంధ్ర సాధనలో పాలుపంచుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే విధానంలో ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారన్నారు. జిల్లాలో అన్ని వర్గాలకు చెందిన వారు స్వచ్ఛందంగా పాల్గొనాలని చెప్పారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి మీ పేరు, ఫోను నెంబరు, ఈ-మెయిల్ ఇతర వివరాలు పొందుపరచాలన్నారు. మీ మొబైల్‌కి వచ్చిన ఓటీపీని నమోదుచేసి ప్రశ్నావళిలో ఇచ్చిన ప్రతిపాదనలను మీ ఐచ్ఛికం లేదా అభిప్రాయాన్ని తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

వెంకటలక్ష్మికి హిందీ ఉత్తమ టీచర్ అవార్డు

సీతానగరం, సెప్టెంబరు 22: ఉత్తమ హిందీ ఉపాధ్యాయురాలిగా సీతానగరం గ్రామానికి చెందిన మద్దూరి వెంకటలక్ష్మి ఎంపికయ్యారు. డాక్టర్ అమృతరావు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ జూబ్లీహిల్స్ హైదరాబాద్ వారు ఆమెకు ఉత్తమ హిందీ ఉపాధ్యాయురాలి అవార్డు ఇచ్చి సత్కరించారు. వెంకటలక్ష్మి ఎంఏ హిందీ పూర్తి చేసి ప్రస్తుతం రఘుదేవపురంలోని జ్ఞాననిధి విద్యానికేతన్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల యాజమాన్యం దాసరి మంగరాజు, దాసరి ప్రసన్నలక్ష్మి, పాఠశాల సిబ్బంది అభినందించారు.

బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

సీతానగరం, సెప్టెంబరు 22: సర్వ బ్రాహ్మణ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఆదివారం సీతానగరంలో సంఘం అధ్యక్షుడు చింతలూరి రంగారావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో చింతలూరి రంగారావు తన పదవికి రాజీనామా చేయడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మండ సోంబాబు, గౌరవాధ్యక్షుడిగా చింతలూరి రంగారావు, ఉపాధ్యక్షుడిగా ఆరాధ్యుల రమేష్, కార్యదర్శిగా సన్నిధిరాజుల రామకృష్ణ(బన్ని), ట్రెజరర్‌గా ములగాడ రామకృష్ణ, సలహాదారులుగా యల్లమంద రవీంద్రబాబు, పల్లేటి సత్యనారాయణ, ఆరాధ్యుల నరేంద్ర ఎంపికయ్యారు.

10శాతం బ్రాందీషాపులు కేటాయించాలి

రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం వినతి

రాజమహేంద్రవరం సిటీ సెప్టెంబరు 22: శెట్టిబలిజ గీత కార్మికులకు డిపాజిట్ లేకుండా 10శాతం బ్రాందీ షాపులు కేటాయించాలని రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు కోరారు. స్థానిక తిలక్‌రోడ్డులోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద గీత కార్మికులు దరఖాస్తు నగదు రూ.2 లక్షల చెల్లించలేరన్నారు. అలాగే వైన్ షాపునకు మునిసిపాలిటీలో రూ.80 లక్షలు, పంచాయతీల్లో రూ.60 లక్షలు చెల్లించాలని తమ దృష్టికి వచ్చిందని అయితే పేద గీత కార్మికుల తరుపున అగ్రవర్ణాలు, ధనవంతులు ఆ షాపులను హస్తగతం చేసుకుంటారని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో మట్టపర్తి సత్యనారాయణ, బత్తిన ఏడుకొండలు, లావేటి సత్యనారాయణ, వొల్లు జగదీష్, కొప్పిశెట్టి రమేష్, బొక్కా సత్యవెంకటప్రతాప్ పాల్గొన్నారు.

అప్పటి టీటీడీ పాలక మండలిపై
చర్యలు తీసుకోవాలి: వీరన్నచౌదరి

కోరుకొండ, సెప్టెంబరు 22: తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ తయారీకి సంబంధించి జరిగిన నిర్లక్ష్యానికి అప్పటి టీటీడీ పాలక మండలి సభ్యులు, చైర్మన్, ఈవోలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వీరన్నచౌదరి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కోరుకొండలో ఓ ప్రకటన విడుదల చేశారు. టీటీడీలో జరుగుతున్న లడ్డూ తయారీలో అవకతవకలపై ఆధారాలతో సహా లభ్యమైనప్పుడు ఇన్నాళ్లు ప్రేక్షక పాత్ర వహించారన్నారు. తిరుపతి ప్రతిష్ఠను జగన్ భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా స్వామి వారి నగదు, ఇతర ఆభరణాలు ఉన్నాయా అన్న సందేహం కలుగుతోందని, ఒకవేళ ఉన్నప్పటికీ అవి అసలైనవా, నకిలీవా అన్న అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు.

కడియపులంకలో ఉచిత వైద్య శిబిరం

కడియం, సెప్టెంబరు 22: ప్రతిఒక్కరికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. ఆదివారం కడియపులంకలో లియా డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ కడియం సీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. శిబిరంలో సుమారు 300 మందికి డాక్టర్లు పి.సూర్యతేజ, కేవీఎస్ రామకృష్ణ, పి.పవన్‌కిషోర్, సీహెచ్ ఆరతి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు గోవిందు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, సత్యనారాయణ, సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రామ్‌జీ, వైస్ ఎంపీపీ పంతం గణపతి, గెడ్డం శివ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులకు అనుమతుల్లేవ్ : సబ్‌కలెక్టరు

ఏజెన్సీలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలకు అనుమతులు నిలిపివేసినట్టు రంపచోడవరం సబ్‌కలెక్టరు కల్పశ్రీ తెలిపారు. ఎవరైనా వస్తే తిరిగి వెనక్కి పంపించాలని అధికారులను ఆదేశించారు. అయితే అటవీశాఖాధికారులు మాత్రం టిక్కెట్లు విక్రయించి మరీ పర్యాటకు లను జలపాతాల వద్దకు అనుమతించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడి పరిస్థితుల పట్ల అవగాహన లేక పర్యాటకులు ప్రాణాలమీదకు తెచ్చుకున్నారు.

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 23 సెప్టెంబరు 2024 | 5

వీళ్లు గల్లంతు



సౌమ్య



అమృత



హరదీప్



చికిత్సపొందుతున్న హరిణి



కన్నీటివాగు : ఒక్కసారి ఉధృతంగా మారి ఐదుగురిని ముంచేసిన జలతరంగణి వాగు ఇదే..

విషాదయాత్ర

ఎప్పుడూ చదువేనా.. కాస్త మార్పు కావాలనిపించింది.. పచ్చని ప్రకృతి ఒడిలో రోజంతా సేదదీరితే.. మళ్లీ రీఫ్రెష్ అవుతామని అనుకున్నారు.. అనుకున్నదే తడవుగా ఏలూరు ఆశ్రంలో మెడికల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 14 మంది తూర్పు ఏజెన్సీలోని అటవీ ప్రాంతానికి వచ్చారు.. మారేడుమిల్లి జలతరంగిణి జలపాతం వద్ద ఆగారు. అప్పటి వరకూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. తమ స్నేహానికి జీవితంలో గుర్తుండేలా ప్రకృతి అందాలతో కలిసి ఫొటోలు దిగారు. అకస్మాత్తుగా ప్రకృతి కన్నెర్ర చేసింది. వర్షపు నీరు వరదలా మారి క్షణాల్లోనే జలపాతంలోకి రావడం గమనించలేకపోయారు. ఒక్కసారిగా వరద పెరిగి 14మందిలో ఐదుగురు కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరిని మిగతా స్నేహితులు, అగ్నిమాపక సిబ్బంది కలిసి అతికష్టం మీద కాపాడారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. దీంతో వీరి విహార యాత్ర.. విషాదంగా మారింది. ఈ వ్యవహారంలో అటవీశాఖ నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇటీవల వర్షాల నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలకు అనుమతులు రద్దు చేశారు. అయినా జలంతరంగిణి వద్ద అటవీశాఖ సిబ్బంది వీరిని అనుమతించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

చూస్తుండగానే ముంచేసిన జలతరంగణి వాగు

- ఆశ్రం విద్యార్థుల విహారయాత్ర
- కళ్లెదుటే ఐదుగురు గల్లంతు
- క్షణాల్లోనే ఆవిరైన ఆనందం
- ఇద్దరిని కాపాడిన స్థానికులు
- కానరాని ముగ్గురి ఆచూకీ
- చీకటిపడడంతో ఆగిన గాలింపు
- అందరూ మెడికల్ విద్యార్థులే
- మారేడుమిల్లి వద్ద ఘటన
- రెండు రోజులుగా అనుమతుల్లేవ్

మారేడుమిల్లి/ఏలూరు క్రైం, సెప్టెంబరు 22 : వైద్య విద్యార్థుల విహారయాత్ర విషాదంగా మిగిలింది.అప్పటి వరకూ ఎంతో ఆనందం గడిపిన వారంత ఒక్కసారిగా హతాశులయ్యారు. అప్పటి ఎంతో ప్రశాంతంగా ఉన్న వాగు క్షణాల్లోనే ఉధృతంగా మారి తమ కళ్లెదుటే స్నేహితులను ముంచేయడంతో కన్నీటి పర్యంతమయ్యారు.ఏలూరు ఆశ్రం వైద్యకళాశాలలో ద్వితీయ సంవత్సరం మెడికల్ విద్యార్థులు 14 మంది విద్యార్థులు టెంపో ట్రావెల్ బస్‌లో శనివారం రాత్రి విహారయాత్రకు బయలుదేరారు. ఉదయం నుంచి పలు ప్రాంతాలు చూసుకుంటూ మధ్యాహ్నానికి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జల తరంగిణి జలపాతం వద్దకు చేరుకున్నారు. అక్కడే భోజనాలు చేసి మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రశాంతంగా కనిపించిన జలపాతంలోకి కొంత మంది స్నానాలకు దిగారు. కొంతమంది ఫొటోలు తీసుకుంటున్నారు. అప్పటికే వర్షం ప్రారంభమైంది. ఎగువ ప్రాంతాల్లో కూడా వర్షం పడుతోంది. వాగులో ఎర్రరంగు నీరు వస్తున్నా స్నానం చేసేవారికి అర్థం కాలేదు. ఫొటోలు తీసేవారు బురద నీరు వస్తోందని కేకలు వేస్తున్నారు. అయినా జలపాతం శబ్దంలో స్నానాలు చేసే వారు గమనించలేకపోయారు. క్షణాల్లోనే నీరు పెరిగిపోతుండగా వెంటనే కొంతమంది తప్పించుకోగా ఐదుగురు చిక్కుకుపోయారు. వాగు ఉధృతికి ఐదుగురు విద్యార్థులు గాయత్రి పుష్ప, చింతా హరిణి ప్రియ, కె.సౌమ్య, బి.అమృత, సీహెచ్ హరదీప్ కొట్టుకుపోయారు. వీరిలో ఒకరిని స్నేహితులు అతికష్టం మీద కాపాడగలిగారు.ఈలోపు పోలీసులకు సమాచారం అందింది. వారు వెంటనే రంపచోడవరం అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. కొండలపై నుంచి వర్షపునీరు ఉధృతంగా రావడంతో మిగిలినవారి జాడ తెలియలేదు.కాసేపటికి జలపాతం దిగువన కల్వర్టు వద్ద సిమెంట్ తూరల్లో ఒకరు ఉన్నట్టు గుర్తించి అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి కాపాడారు. గాయత్రి ప్రియ, చింతా హర్షిణీలను రక్షించారు. మిగిలిన ముగ్గురు విద్యార్థులు ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన చింతకుంట హరదీప్ (20), విజయనగరం జిల్లాకు చెందిన కొసిరెడ్డి సౌమ్య(21), బాలిఅమృత (22) గల్లంతయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఒకరిని మెరుగైన వైద్యంకోసం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పినట్టు సమాచారం. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయగా ..చీకటి పడిపోవడం.. వర్షం పడుతుండడంతో ఆటంకంగా మారాయి. రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మారేడుమిల్లి సీఐ సీహెచ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వైద్యవిద్యార్థుల కోసం తమ కళాశాల తరపున ప్రత్యేక బృందాన్ని పంపించామని,వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఏలూరు ఆశ్రం కళాశాల యాజమాన్యం వెల్లడించింది.

ఆశ్రంలో తీవ్ర విషాదం..

గల్లంతైన వారు ఎక్కడైనా చెట్లను పట్టుకుని బతికి ఉన్నారేమో అనే ఆశతో తోటి విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. గల్లంతైనవారిలో చింతపల్లి హరదీప్‌కు బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా పేరుంది.కార్డియాలజీలో ప్రత్యేక వైద్యనిపుణుడిగా పేరు పొందాలనే ఆశయం చదువుతున్నాడు. బాలి అమృత తెలివైన విద్యార్థిని.. డాక్టర్ చదివి పేదల వైద్యురాలిగా పేరు పొందాలనే ఆశయంతోనే ఉంది. కొసిరెడ్డి సౌమ్య మంచి వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయాలనే ఆశయంతోనే చదువును కొనసాగిస్తోంది.ముగ్గురు విద్యార్థులు జలపాతం వద్ద కొట్టుకుపోయారని సమాచారం అందడంతో ఆశ్రం కళాశాలలో విద్యార్థుల్లో తీరని విషాదం నెలకొంది. ఘటనపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్టు మంత్రి చెప్పారు.

యాత్రకు వెళ్లింది వీరే..

మొత్తం 14మంది విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. **గల్లంతైన విద్యార్థులు :** కొసిరెడ్డి సౌమ్య(21), బాలి అమృత (22)(విజయనగరం జిల్లా), చింతకుంట హరదీప్(20)(ప్రకాశం జిల్లా మార్కాపురం), **గాయపడినవారు :** దండే గాయత్రి పుష్ప(బాపట్ల), సీహెచ్ హరిణి ప్రియ (విశాఖ జిల్లా మధురవాడ), పొట్లూరి ప్రజ్ఞ (భీమిలి) **మిగిలినవారు :** హిమబిందు(బొబ్బిలి), మేఘన(కర్నూలు), స్వప్న(అనంతపురం), హరినేత్ర(చీరాల), అవినాష్, హరిప్రియ, ధీరజ (రాజమండ్రి),జాగృతి(ద్వారకాతిరుమల)

పులిపిరి (సురిడి కాయ) ఆకు పసరుతో మటుమాయం

తూర్పుగోదావరి జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్స్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపోసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

23, 24, 25 తేదీల్లో కాకినాడ మెయిన్ రోడ్, చందనా బ్రదర్స్ ఎదురుగా, జయరాం హీరో షోరూమ్ ప్రక్కన, హోటల్ శ్రీవాత్స, కాకినాడ నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి చార్జి చేయబడును). **ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6.00 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్‌చేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

సార్ చెప్పారా..



సిఫారసు ఉంటే కోరుకొన్న చోటకు బదిలీ

- ఎమ్మెల్యేల సిఫారసులకే ప్రాధాన్యం
- 102 మందికి స్థానచలనం
- ఆరోపణలున్నా కోరుకున్న చోటుకే..
- కౌన్సెలింగ్‌లో ఉండగానే డీపీవో బదిలీ
- కొత్త డీపీవోగా శ్రీనివాసరావు
- పలువురు ఉన్నతాధికారుల బదిలీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పంచాయతీ సెక్రటరీల బదిలీల కోసం ఉత్తుత్తి కౌన్సెలింగ్ జరిగింది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫార్స్ లేఖలు పొందిన వారికే తొలి ప్రాధాన్యం ఇచ్చారు. వారు కోరుకున్న చోటకే ఎక్కువమందిని బదిలీ చేశారు. ఐదేళ్ల సర్వీసు నిండిన వారిని మొత్తం మార్చేశారు. అనారోగ్యం, రిక్వస్ట్ బదిలీలను పరిగణనలోకి తీసుకున్నారు. జిల్లాలో సుమారు 103 మంది బదిలీలకు కౌన్సిలింగ్‌కు హాజరు కాగా 102 మందికి బదిలీ అవకాశం కల్పించారు. జిల్లాలో 300 గ్రామ పంచాయతీలు ఉన్న సంగతి తెలిసిందే. అందులో 102 మంది బదిలీ అయ్యారు. కొంతమంది బదిలీలు కోరుకోలేదు. అవకాశం ఉంటే వేరే జిల్లాలకు వెళ్లాలనే ఆలోచనతో ఉన్నారు. కానీ సోమవారంతో బదిలీల ప్రక్రియ ముగుస్తుంది.

కలెక్టరేట్‌లో ఉత్తుత్తి కౌన్సెలింగ్..

జిల్లాలోని బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న వారందరికీ కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.ఉదయం రాజమండ్రి డివిజన్ పరిధిలోని వారికి, మధ్యాహ్నం కొవ్వూరు డివిజన్ పరిధిలోని వారికి కౌన్సెలింగ్ జరిగింది. ఇన్‌చార్జి డీపీవో డి.రాంబాబు, రాజమహేంద్రవరం డీఎల్‌పీవో నాగలత, కొవ్వూరు డీఎల్‌పీవో అమ్మాజీ కౌన్సెలింగ్ నిర్వహించారు. పేరుకే కౌన్సిలింగ్ జరిగిందనే ప్రచారం ఉంది. ఎందుకంటే ముందుగానే ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేల, ఎంపీ నుంచి తీసుకున్న సిఫార్స్‌ల మేరకే బదిలీలు జరగడం గమనార్హం. మీరు ఏ ఎక్కడికి కోరుకున్నారు అని అడగడం.. ఫలానా చోటని చెప్పడం.. సరే..ఓకే అని చెప్పడం.. ఇలానే కౌన్సెలింగ్ జరిగింది. ఒకట్రెండు చోట్ల ఇబ్బంది అయినట్టు తెలిసింది.ఒక సెక్రటరీ ఒక పంచాయతీని కోరగా.. అప్పటికే అక్కడ ఓ ఎమ్మెల్యే మరొకరికి సిఫార్స్ లెటర్ ఇచ్చారు.. దీంతో ఇబ్బంది తలెత్తింది. అయితే వెంటనే ఆ సెక్రటరీకి ఒక ఫోన్ వచ్చింది.. ఎవరు ఏమి మాట్లాడారో కానీ సదరు సెక్రటరీ మరో పంచాయతీని కోరగా అది ఖాయం చేశారు. గతంలో సస్పెండై, వివిధ ఫిర్యాదులున్న వారికి కోరుకొన్న చోట బదిలీ అవకాశాలు కల్పించడం గమనార్హం. ఒక సెక్రటరీ బదిలీ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టిలో పెట్టినట్టు తెలిసింది.ఇతర జిల్లాలకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని మాత్రం తర్వాత పిలుస్తామని పంపించేశారు.చివరకు జిల్లాలో 102 మంది సెక్రటరీలను బదిలీ చేయగా వారిలో ఎక్కువ మంది కోరుకున్న చోట కే బదిలీ అయ్యారు.చాలా మంది సెక్రటరీలు తాము కోరుకున్న విధంగా పంచాయతీలను దక్కించుకు న్నట్టు ప్రచారం జరుగుతోంది.ప్రస్తుతం బదిలీ పొందిన వారంతా సుమారు వారం రోజుల్లో విధుల్లో చేరవలసి ఉంది.

అయ్యో పాపం ఇన్‌చార్జి డీపీవో..

జిల్లాలోని సెక్రటరీలకు కౌన్సిలింగ్ ఇస్తూ ఆదివారం బిజీగా ఉన్న జిల్లా ఇన్‌చార్జి డీపీవో డి.రాంబాబుకు చుక్కెదురైంది. కౌన్సిలింగ్‌లో ఉండగానే ఆయను బదిలీ చేయడంతో పాటు హెడ్ ఆఫీసులో రిపోర్ట్ చేయాలనే ఆర్డర్ రావడం గమనార్హం. ఆయన ఎంపీడీవో స్థాయి అధికారి. ఇక్కడ ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారిగా వ్యవహరిస్తున్నారు.

డీపీవోగా శ్రీనివాసరావు

తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అధికారిగా బి.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన డీఎల్‌డీవో హోదాలో ఇప్పటి వరకూ ఏపీసీ ఎస్ఎస్‌ఏగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఆయనకు ప్రమోషన్ ఇచ్చి జిల్లా పంచాయతీ అధికారిగా నియమించారు.కొవ్వూరు డీఎల్‌డీవో వి. శాంతామ ణికి ప్రమోషన్ ఇచ్చి అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారిగా నియమించారు.జిల్లాలో పలువురు ఎంపీ డీవోలు, ఈవోపీఆర్‌డీలు కూడా బదిలీ అయ్యారు.

పనిచేసిన డబ్బు..

మని మేక్స్ మెనీ థింగ్స్.. బదిలీల్లో ఇదే జరిగింది.. డబ్బు చేయలేని పనిలేదని నిరూపించింది. ఎందుకంటే ఆరోపణలున్న వారిని కోరుకున్న చోటుకే బదిలీ చేయడం గమనార్హం. అదే విధంగా సిఫార్స్ లేఖ ఉంటే రైట్ రైట్ అన్నారు. కౌన్సెలింగ్ ఎందుకు పెట్టారనేది చాలా మందికి అర్థం కాని అంశం. ఎందుకంటే ఎవరు కోరుకున్న చోటుకు వారిని బదిలీ చేసేశారు. ఈ మాత్రం దానికి కౌన్సెలింగ్ ఎందుకనేది పలువురి వాదన. డబ్బు బాగా చేతులు మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏపీ టిడ్కో ఎస్ఈగా కోటేశ్వరరావు

ఏపీ టిడ్కో ఎస్ఈగా వైవీ కోటేశ్వరరావు విజయ వాడ నుంచి వచ్చారు. రాజమహేంద్రవరంలో పనిచేస్తు న్న ఎంసీహెచ్ కోటేశ్వ రరావు విజయవాడ వెళ్లారు. పబ్లిక్ హెల్త్ రాజమండ్రి సర్కిల్ ఎస్ఈ ఎ.సుధాకర్ విశాఖపట్నానికి బదిలీ అయ్యారు.ఆయన స్థానంలో రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎస్ఈ జి.పాండురంగారావు నియమితులయ్యారు.కార్పొరేషన్ ఎస్ఈగా వైకృష్ణారావు (విజయవాడ) నియమితులయ్యారు. డ్వామా పీడీగా ఎ.నాగమహేశ్వరరావు నియమితులయ్యారు. రాజమహేంద్రవరం ఈఈ ఆర్‌వీ శేషగిరిరావు ఏలూరు ఏపీ టిడ్కో ఈఈగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో వెంకటేశ్వరరావు బదిలీపై నియమితులయ్యారు.

కొవ్వూరులో.. వీడని టెన్షన్!



శ్రీరామకాలనీ(తుని కాలనీ)

నివురుగప్పిన నిప్పులా మారిన ప్రాంతం



రాజీవ్‌కాలనీలో పోలీస్ పహరా

- ఇంకనూ చల్లారని గొడవలు
- 19న ఇరువర్గాల మధ్య ఘర్షణ
- మూడు రోజులైనా అదే తీరు
- 100 మందిపై కేసులు నమోదు
- ఇరువర్గాల్లో 50 మందికి నోటీసులు
- 200 మంది పోలీసుల పహరా
- రోడ్డు వేస్తేనే సమస్యకు పరిష్కారం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు

కొవ్వూరు శివారులోని తుని పేట, రాజీవ్ కాలనీ (మత్స్యకార) ప్రాంతాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. గణేశ్ శోభాయాత్రలో ఆకతాయిలు తెచ్చిన గొడవ చినికి చినికి రెండు సామాజిక వర్గాల మధ్య చిచ్చు రగిల్చింది. కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరికి గాయాలయ్యే వరకూ వెళ్లింది. గొడవ మూడు రోజుల ముందే మొదలైంది. దీనిని పసిగట్టి గద్దించడంలో అటు పోలీసులు, ఇటు ఇరువర్గాల పెద్దలు విఫలం కావడంతో పరిస్థితి తీవ్రమైంది.చిన్న తగాదా సర్దుబాటు చేయడంలో కాస్త ఆదమరుపుగా ఉండడం పెద్ద రగడకు దారితీ సింది. ప్రస్తుతం నిశ్శబ్దంగా ఉన్నా ఆ రెండు కాలనీల్లో ఏ క్షణంలో ఏం జరుగుతుందో అనే టెన్షన్‌పై 'ఆంధ్రజ్యోతి' గ్రౌండ్ రిపోర్ట్.

మూడు రోజుల కిందట జరిగిందిదీ!

ఈ నెల 19న రాత్రి సమయంలో రాజీవ్ కాలనీలోని గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం కోసం శోభాయాత్రగా తీసుకెళుతు న్నారు. ఈ కాలనీ నుంచి సాధారణంగా హైవేకు తుని పేట (ఎస్సీ కాలనీ), శ్రీరామ కాలనీ మధ్యలోని రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటారు.ఆ రోజు కూడా పోలీసులు కేటాయించిన రూట్ మ్యాప్ ప్రకారం అదే దారిలో వెళుతున్నారు. సరిగ్గా ఎస్ టర్నింగ్ దగ్గరకు వచ్చేసరికి తుని కాలనీ కుర్రాళ్లు కొందరు శోభాయాత్ర చేస్తున్న వాళ్లను కవ్వించడంతో రాళ్లతో దాడికి దిగారు. ఆ రోజు ఎస్‌ఐకి రాయి తగిలి గాయమైంది. ఎస్పీ నర సింహ కిశోర్ సుమారు 200 మంది పోలీసు సిబ్బందితో సంఘటనా ప్రదేశానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.ఆ మరుసటి రోజున తుని పేటకు చెందిన నలుగురు యువకులు ఇద్దరు మత్స్యకార యువకులపై దాడి కి దిగారు.ఈ విషయం తెలియడంతో సుమారు 200 మంది మత్స్యకారులు తుని పేటలోకి వెళ్లి ఆటో, 3 ద్విచక్ర వాహనాలను పాక్షికంగా ధ్వంసం చేశారు.

35 ఏళ్ల కిందట వచ్చి.. స్థిరపడి..

తుని ప్రాంతం నుంచి పొగాకు బ్యారన్లలో పనిచేయడానికి తుని నుంచి కొందరు సుమారు 38 ఏళ్ల కిందట ఈ ప్రాంతానికి వచ్చారు.అందువల్ల దీనిని తుని పేట అంటారు. చిత్రం ఏమిటంటే.. మత్స్యకారులు ఉపాధి నిమిత్తం దాదాపు 33 ఏళ్ల కిందట తుని ప్రాంతం నుంచే ఇక్కడికి వచ్చారు. అప్పటి నుంచీ ఏ ఇబ్బందీ లేకుండా జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు తునికాలనీ, మత్స్యకార కాలనీకి మధ్య రోడ్డు లేక తీవ్ర ఇబ్బంది పడేవాళ్లు. ఎన్నో పోరాటాల తర్వాత సిమెంటు రోడ్డు వేశారు. దీంతో రాజీవ్ కాలనీ నుంచి ఇటు, తుని పేట నుంచి అటు రాకపోకలు సులభమయ్యాయి. తదనంతర పరిణామాల నేపథ్యంలో రెండు కాలనీల వాళ్ల మధ్య సఖ్యత లేకపోవడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. రెండు కాలనీల వాళ్లు తుని పేట మీదుగానే వెళ్లాల్సి రావడంతో వెళ్లినప్పుడు వచ్చినప్పుడు ఏదో ఒక విధంగా గొడవ పెట్టుకుంటున్నారు.

రోడ్డు వేస్తేనే సమస్యకు పరిష్కారం

మత్స్యకార కాలనీకి చివరన అటు హైవేకు, ఇటు గోదావరి గట్టుకు వెళ్లే రోడ్డు ఉన్నా ఆ దారుల్లో సరైన సదుపాయాలు లేవు. పైగా గోదావరి గట్టు దారిలో వెళితే చుట్టూ తిరిగి వచ్చే పరిస్థితి ఉంది. దీంతో స్కూలు పిల్లలకు, వివిధ పనులపై వెళ్లే మత్స్యకారులకు దూరాభారం. దీంతో కచ్చితంగా తుని కాలనీ చివర వీధిగుండా వెళ్లాల్సిందే. కవ్వింపు స్థాయిలో ఉండే గొడవలు పోలీసుల పహరా వరకూ వచ్చాయి. అందువల్ల గతంలో ప్రతిపాదించిన మాదిరిగా మత్స్యకార కాలనీ చేరువలో ఉన్న చెరువు పక్కగా కొవ్వూరు ప్రధాన రహదారిని కలుపుతూ సుమారు ఒక కిలోమీటరు రోడ్డు వేస్తే సమస్యకు చాలా వరకూ పరిష్కారం దొరికే అవకాశం ఉంది. లేకపోతే రానున్న రోజుల్లో కూడా ఇక్కడ పరిస్థితులు సమస్యలను కొనితెచ్చే విధంగానే ఉంటాయని స్థానికులు చెబుతున్నారు.

200 మందితో పోలీస్ పహరా

ఈ ప్రాంతాల్లో సుమారు 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో డీఎస్పీ దేవ కుమార్ ఆధ్వర్యంలో కొవ్వూరు టౌన్ సీఐ పి.విశ్వం, రూరల్ సీఐ విజయ్ కుమార్, దేవరపల్లి సీఐ శేఖర్‌బాబు, సీఐ పవన్ కుమార్ రాజమండ్రి, కొవ్వూరు సబ్-డివిజన్ల సిబ్బందితో పహరా కాస్తున్నారు.పలు వీధుల్లో పోలీసులను మోహరించారు. ఇరువర్గాలకు కౌన్సెలింగ్ చేస్తున్నారు.సుమారు 100 మందికి నోటీసులు ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. ఇప్పటికే 50 మందికి సెక్షన్ 41 ప్రకారం నోటీసులు అందజేసి విచారణకు హాజరు కావాలన్నారు.అల్లర్లు చెలరేగిన రోజు వీడియోలు సేకరించారు. ఐదు రకాల కేసులను బనాయిస్తున్నట్లు తెలుస్తోంది.10 మంది యువకుల అసాంఘిక కార్యకలాపాల వల్ల ఈ రెం డు కాలనీల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలుస్తోంది.ప్రధా నంగా వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గొడవ జరిగిన ప్రాంతమిదే

రోడ్డు కావాలంటే వేస్తాం..



ఇప్పటికే తునికాలనీ వాళ్లను పిలిచి మాట్లాడాం. మత్స్యకారులతోనూ మాట్లాడతాం. ఇరువర్గాలూ సంయమనం పాటించాలి.గొడవల సంస్కృతి మంచిది కాదు.. పిల్లల జీవితాలు ఇబ్బందుల్లో పడ తాయి. ఒకవేళ రోడ్డు, డ్రైన్ల వంటివి వేస్తే సమస్యలకు పరిష్కారం దొరుకే అవకాశం ఉంటే కచ్చితంగా త్వరితగతిన రోడ్డు వేయడానికి చర్యలు తీసుకుంటాం. ఆయా కాలనీల్లోని పెద్దలు కూడా యువకుల నడతను గమనిస్తూ తీవ్ర ప్రవర్తన ఉంటే మందలిస్తూ ఉండాలి.

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

సామాజిక స్పృహ అవసరం



సామాజిక స్పృహ అవసరం. ఒకరిని ఒకరు గౌరవించుకోవాలి.ఇప్పటికీ ఇలాంటి ఘటనలు జరుగుతుండడం విచారకరం. రెండు కాలనీల్లో పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించాం. పరిస్థితి అదుపులోనే ఉంది. ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అంచనా వేస్తున్నాం. కౌన్సెలింగ్ చేస్తున్నాం. మరో రెండు మూడు రోజులు ఇదే మాదిరిగా బందోబస్తు ఉంటుంది. తర్వాత కొద్ది రోజుల పాటు పికెట్‌లు ఏర్పాటు చేస్తాం. శాంతి భద్రతలకు, సాధారణ జనజీవనానికి విఘాతం కలిగించే వాళ్లను విడిచిపెట్టం. అసాంఘిక వ్యక్తులను ఉపేక్షించేది లేదు. కేసులు ఎదుర్కోవాల్సిందే. **- నరసింహ కిశోర్, ఎస్పీ**

సాంస్కృతిక వారసత్వానికి పెద్దపీట వేస్తాం : దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22: సాంస్కృతిక వారసత్వానికి పెద్దపీట వేస్తామని రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఆదివారం రాత్రి శ్రీలలిత కళ నృత్యనికేతన్ ఆధ్వర్యంలో భారతీయ నృత్యోత్సవం -13 కార్యక్రమం జరిగింది.మంత్రి దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళలు, సాంస్కృతిక వారసత్వానికి పెద్దపీట వేస్తుందన్నారు.పోటాపోటీగా నృత్యాలు చేసిన చిన్నారులను అభినందించారు. మన భాషా మన కళా సంస్కృతి ప్రాభవం కోల్పోతున్న నేపథ్యంలో వందలాది మంది చిన్నారులు కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తుంటే మన కళ శాశ్వతంగా అజరామరంగా నిలిచిపోతుందన్నారు. అద్భుత కళాకారుడుగా ఎదిగిన రాజమహేంద్రవరానికి చెందిన నాట్యగురువు ఆరవ అంజనేయులును అభినందించారు. ఈ కార్యక్రమంలో నృత్యగురువులు, సంగీత కళాకారులు, అధ్యాపకులు, కూచిపూడి కళాకారులు,విద్యా ర్థులు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి పర్యాటక రంగంపై 4 కేటగిరిల్లో జిల్లా స్థాయి పోటీలు

ప్రపంచ పర్యాటక దినోత్సవం -2024 పురస్కరించుకుని ఈనెల 27 నుంచి నన్నయ్యయూనివర్శిటి క్యాంపస్ ఎన్‌టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పర్యాటక అంశాలపై జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. వక్తృత్వ, క్విజ్, వీడియోరీల్స్, ఫొటోగ్రఫీ విభాగాల్లో ఆసక్తిగల ఔత్సాహిక యువతి యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. గరిష్ఠంగా ఒక్కొక్క కళాశాల నుంచి 4 నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉందన్నారు. మరింత సమాచారం కోసం నన్నయ యూనివర్శిటి హెచ్‌వోడీ ప్రొఫెసర్ ఎస్.ఉదయభాస్కర్ 91823 01625, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం నెంబరు 63099 42025, టూరిజం సీనియర్ అసిస్టెంట్ బి.అన్వర్ హుస్సేన్ 9121725757, టూరిజం జూనియర్ అసిస్టెంట్ కె.సురేష్ కుమార్ 70365 30828ను సంప్రదించాలన్నారు.



కొవ్వూరు పాతవూరులో ఉమాచోడేశ్వరస్వామికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన

కొవ్వూరు, సెప్టెంబర్ 22: కొవ్వూరు పట్టణంలోని పాతవూరులోనున్న శ్రీ ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన నిర్వహించారు. ఆదివారం పట్టణానికి చెందిన యేడిద వెంకట కామేశ్వరరావు, పద్మావతిదేవి దంపతులు పీఠలపై కూర్చుని పూజలు జరిపారు. ఉదయం నుంచి గణపతిపూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, అమ్మవారికి శ్రీసూక్త విధానంలో కుంకుమ పూజలు, స్వామి వారికి బిళ్వార్చన చేశారు. అనంతరం దేవతామూర్తులను అలంకరణ చేసి నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించారు. ఆలయ అర్చకులు కౌతవరపు బాను, దేవరకొండ సాయిప్రసాద్, ఉమామహేశ్వర శర్మ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కలిగొట్ల కృష్ణారావు, వాడ్రేవు సాయి కామరాజు, వెలమకన్ను రామ బ్రహ్మం తదితరులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

అండర్-17 పోటీలకు క్రీడాకారుల ఎంపిక

దేవరపల్లి, సెప్టెంబరు 22: దేవరపల్లి మండలం పల్లంట్లలో జడ్పీ హైస్కూల్‌లో జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికలకు పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 25 స్కూల్స్ నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొనగా బాలురు 25, బాలికలు 25 చొప్పున ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు గుంటూరు జిల్లా వినుకొండలో ఈ నెల 28, 29, 30లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ ఓరుగంటి కృష్ణంరాజు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను టీడీపీ నాయకులు కొయ్యలమూడి చినబాబు, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి కొయ్యలమూడి సుధారాణి, రామన్నపాలెం ప్రధానోపాధ్యాయులు పేరం రవీంద్రనాథ్, దేవరపల్లి పీడీ ఓరుగంటి నాగరాజు అభినందించారు.



వృద్ధాశ్రమానికి సీలింగ్ ఫ్యాన్లు అందిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

రోటరీ సెంట్రల్ వృద్ధాశ్రమానికి సీలింగ్ ఫ్యాన్లు అందజేత

నిడదవోలు, సెప్టెంబరు 22: నిడదవోలు పట్టణంలోని రోటరీ సెంట్రల్ వృద్ధాశ్రమానికి ఆదివారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సీలింగ్ ఫ్యాన్లు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ గవర్నర్ వలివేటి ఎల్.ఎన్.వి.ప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు బచ్చు లక్ష్మణరావు (నాని), సెక్రటరి ఉప్పల సతీష్, వాసవీ క్లబ్ సభ్యులు కొనిజేటి సురేష్ కుమార్, కేదారిశెట్టి సత్యనారాయణ, ఆలమూరి రాజశేఖర్, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.



ముళ్ళపూడి వెంకటరత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెండ్యాల అచ్చిబాబు, జనసేన కన్వీనర్ సువర్ణరాజు

ముళ్లపూడి కుటుంబానికి అచ్చిబాబు పరామర్శ

నల్లజర్ల, సెప్టెంబరు 22: జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు తండ్రి వెంకటరత్నం మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఆంధ్రా షుగర్స్ జెఎండీ పెండ్యాల అచ్చిబాబు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు పరామర్శించారు. వెంకటరత్నం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట జనసేన మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, నాగ ప్రసాద్, ఫణి,సత్తిబాబు, మధు, ఉన్నమట్ల సత్య కిశోర్, సెందిల్ కుమారి తదితరులు ఉన్నారు.



డ్రోన్‌తో పిచికారి చేసేందుకు కషాయాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కొవ్వూరు, సెప్టెంబర్ 22: వ్యవసాయ సాగులో రసాయనాలు, పురుగులు మందులు వాడకం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని ప్రకృతి వ్యవసాయశాఖ అధికారులు ఎం.టి. మహారాణి తెలిపారు. ఆదివారం ప్రకృతి వ్యవసాయంపై కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ కషాయాల తయారీ వివరించారు. అనంతరం తయారు చేసిన కషాయాలను డ్రోనుతో పొలాల్లో పిచికారి చేశారు. కార్యక్రమంలో ఎన్.ఎఫ్ఏ హరీషా, యూనిట్ ఇన్‌చార్జిలు పి.గోపాలకృష్ణ, డి.విజయలక్ష్మి, ఎస్.వెంకట్రావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

దేవరపల్లి, సెప్టెంబరు 22: దేవరపల్లిలో ప్రధాన కూడలి వద్ద చెత్తకుప్పలు పేరుకుపోయాయి. ఈ చెత్త ఎక్కడికక్కడ ఉండటంతో పందులు, కుక్కలు వాటిని ధ్వంసం చేయడంతో మరింత దుర్గంధం వెదజల్లుతున్నాయి. దేవరపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోని శ్రీచైతన్య స్కూల్, పల్లంట్ల రోడ్డులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో, గోపాలపురం రోడ్డులో చెత్త పేరుకుపోయింది. వీటి వలన దోమలు పెరిగిపోవడంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉన్నందున అధికారులు వెంటనే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించటమే కానీ ఆచరణలో శూన్యంగా కనిపిస్తున్నది. గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండాలంటే పలుచోట్ల పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆయా గ్రామాలవాసులు, ప్రజలు కోరుతున్నారు. భవిష్యత్తులో ప్రజలు రోగాలబారిన పడకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



దేవరపల్లి శివారు రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

అన్న సమారాధన

చాగల్లు, సెప్టెంబరు 22: చాగల్లులో తెలగ సంఘంతో పాటు చాగల్లు, నెలటూరు వర్తక సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా ఉత్సవాలు జరిగాయి. ఆదివారం ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయా కమిటీల ఆధ్వర్యంలో అన్న సమారాధనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు ఈ అన్నదానంలో పాల్గొన్నారు. ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు వీటి ఏర్పాట్లను పర్యవేక్షించగా, పలువురు యువకులు సహకారాన్ని అందించారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి లక్ష్యం



నిడదవోలులో ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, సెప్టెంబరు 22: సంక్షేమం, అభివృద్ధి బాటలో కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన సాగిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలు పట్టణంలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్యనగర్, ఎన్టీఆర్ కాలనీ, సుబ్బరాజుపేటలలో ఇంటింటికి వెళ్ళి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రజలందరి సమక్షంలో కేక్ కట్ చేశారు. తీరుగూడెంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో దీపావళి నుంచి ప్రజలకు మూడు ఉచిత సిలెండర్లు అందజేయనున్నామని తెలిపారు. నిడదవోలు పట్టణానికి సంబంధించి మినీ స్టేడియం అందుబాటులోకి తీసుకు వస్తామని, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామన్నారు.

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి దుర్గేష్

త్వరలో గోదావరి జలాలు పట్టణ ప్రజలకు అందేలా కృషి చేస్తామన్నారు. అనంతరం ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న కోరుపల్లి, విజ్జేశ్వరం, నిడదవోలులోని గృహాలకు ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు పలు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందు అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, తహశీల్దార్ నాగరాజు నాయక్, జనసేన పార్టీ అధ్యక్షుడు రంగా రమేష్, తిరుపతి సత్యనారాయణ, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి లక్ష్యం : ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, సెప్టెంబరు 22: గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన ఉందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నెలటూరు సర్పంచ్ యడ్లపల్లి ఉమారజని, రకారావు దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నియోజకవర్గం ఇన్‌చార్జి గొర్రెల శ్రీధర్‌తో కలిసి కట్ చేశారు. గ్రామంలో పలు వీధుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. మహిళలకు ఉచిత గ్యాస్ బండలు దీపావళి నుంచి అందజేస్తారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం తిరుపతి లడ్డూను కల్తీ చేసి అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ళ హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్ తదితరులతో పాటు జనసేన నాయకులు ఉప్పులూరి చిరంజీవి, ఇంటి వీరబాబు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మల్లవరంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోడూరి లక్ష్మి సుభాషిణి, ఉపసర్పంచ్ కోడూరి కాశిగంగాధరరావు, కే.వెంకటరాయుడు, ఎల్.వీరభద్రం, కే.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



నెలటూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నియోజకవర్గం ఇన్‌చార్జి గొర్రెల శ్రీధర్ తదితరులు

నేడు గోపాలపురంలో...

గోపాలపురం, సెప్టెంబరు 22: నేడు మండలంలోని పలు గ్రామాల్లో మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చెరుకుమిల్లి, వెంకటాయపాలెం, చిట్యాల, పెద్దాపురం, వేలచింతలగూడెం, గోపాలపురం, భీమోలు, వాదాలకుంట, వెదుళ్ళకుంట, కోమటికుంట, కరిచర్లగూడెం గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అన్నారు.

దేవీ నవరాత్రుల పోస్టర్ ఆవిష్కరణ



తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, సెప్టెంబరు 22: కోట సత్తెమ్మతల్లి కరుణా కటాక్షాలతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో దేవీ నవరాత్రుల మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ దేవీ నవరాత్రులలో కోట సత్తెమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు చక్కటి ఏర్పాట్లు చేసి అందరి ఆదరాభిమానాలు పొందాలని అధికార్లకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్, ఆలయ సహాయ కమీషనర్ మరియు కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్య ప్రకాష్, ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ, ఆలయ సూపరిండెంట్ జెల్లా సోమరాజు తదితర్లు పాల్గొన్నారు.


కోట సత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలోనున్న కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివా రం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యా ర్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంత రం అమ్మవారికి మహానివేదన చేశారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీక రించారు. ఆదివారం పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. ఆదివారం అమ్మ వారికి రూ.1,16,609 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్య ప్రకాష్ ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో కోట సత్తెమ్మ అమ్మవారు

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా వేణుగోపాలకృష్ణ



రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 22: వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ బొమ్మూరులో పార్టీ కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూ తయారీలో భక్తుల మనోభావాలపై చంద్రబాబు నింద వేశారన్నారు. ఈ వ్యవహారంపై సీబీఐతో విచారణ చేయించాలన్నారు. నిల్వ వుంచిన ఇసుకను దొంగిలించిన టీడీపీ నేతలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లపై పలు విమర్శలు చేశారు. ఈ సందర్భంగా వేణుకు పార్టీ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, గూడూరి శ్రీనివాస్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం

కొవ్వూరు, సెప్టెంబర్ 22: గోదావరిలో గుర్తు తెలియని మృతదేహాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని పిండాలరేవు వద్ద గోదావరిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం తేలుతున్నదన్న సమాచారంతో పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. గోదావరి నుంచి మృతదేహాన్ని తీయించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయసు 60 సంవత్సరాలు దాటి ఉంటుం దని, వివరాలు తెలియలేదన్నారు. ఆచూకి తెలిసిన వారు 94407 96622లో సమాచారం అందించాలన్నారు. కేసు మోదు చేసినట్లు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.

స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం

నిడదవోలు, సెప్టెంబరు 22: ఉపాధి నిమిత్తం మస్కట్ వెళ్లిన యువకుడు అక్కడ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఆదివారం మృతదేహం ఇంటికి రావడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. నిడదవోలు మండలం కంసాలిపాలెం గ్రామానికి చెందిన అవిటి రాజు (24) మూడేళ్ళ క్రితం ఉపాధి కోసం మస్కట్ వెళ్ళాడు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందగా, బంధువులు, గ్రామస్తులు తల్లిదండ్రులకు, తమ్ముడికి తెలియకుండా గోప్యత పాటించారు. తల్లిదండ్రుల అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రోడ్డు ప్రమాదంలో రాజు గాయపడ్డాడని చికిత్స పొందుతున్నాడంటూ శనివారం వారికి చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున మస్కట్ నుంచి రాజు మృతదేహాన్ని బంధువులు గ్రామానికి చేర్చారు. త్వరలో పెళ్లి చేయాలనే ఆలోచనలో ఉన్న కుటుంబానికి రాజు మృతదేహం రావడంతో వారి రోదనలు మిన్నంటాయి.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

కొవ్వూరు, సెప్టెంబర్ 22: తునిపేట వాసులకు చెందిన దళితులపై దాడిచేసిన వారిపై పది రోజుల్లో కేసులు నమోదు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మాజీ ఎంపీ జీవీ. హర్షకుమార్ అన్నారు. ఆదివారం రాత్రి శ్రీరామకాలనీలో హర్షకుమార్ పర్యటించి వినాయక నిమజ్జన ఊరేగింపులో జరిగిన దాడిలో గాయపడిన వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరుపాడులో ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. కొవ్వూరు, తునిపేటలో దళితులపై దాడులు జరిగి నాలుగు రోజులు అయినా వైసీపీ వాళ్లు రాలేదని ఆరోపించారు. ఓట్లు వేయించుకున్న అధికార పార్టీ వాళ్ళు కూడా రాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మన సమస్యలు, ఇబ్బందులను సోషల్ మీడియాలో ప్రపంచానికి తెలియజేద్దామన్నారు. కార్యక్రమంలో బొంతా శ్యాం రవిప్రకాష్, మాసా ఆనంద్, వెంకటేష్, సాకా పుల్లారావు, కౌన్సిలర్లు బొండాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు 1వ వార్డు శ్రీరామకాలనీలో మాట్లాడుతున్న హర్షకుమార్



టీడీపీ నాయకుడు పెండ్యాల అచ్చిబాబుకు విరాళం చెక్కు అందిస్తున్న దృశ్యం

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం

కొవ్వూరు, సెప్టెంబర్ 22: వరద బాధితుల సహాయార్థం కొవ్వూరు మండలం పశివేదల గ్రామస్తులు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.2,82,111 అందజేశారు. టీడీపీ నాయకులు బేతిన నారాయణ, గారపాటి శ్రీనివాసరావు, రామచంద్రరావు, తుంపల్లి ఆదినారాయణ, ఉండవల్లి రాజగోపాల్ నాయకత్వంలో గ్రామస్తుల నుంచి సేకరించిన విరాళాన్ని ఆదివారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)కు అందజేశారు. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, కెవికె రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 22: జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఈ-డిస్ట్రిక్టు మేనేజర్ పోస్టు భర్తీకి ఆసక్తి, అర్హతలు కల్గిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ దరఖాస్తు చేసుకోవడానికి బీసీఏ, బీఎస్సీ, బీఈ, బీటెక్, మాస్టర్స్ డిగ్రీ పాసై, ఐటీ సెక్టార్‌లో రెండేళ్ల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆగస్టు 31వ తేదీ నాటికి 21-35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటల నుంచి అక్టోబరు 2వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తులు అందజేయాలని, నోటిఫికేషన్, దరఖాస్తు నమూనా www.eg.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చునన్నారు.

స్వర్ణాంధ్ర 2047 సాధనలో భాగస్వాములవ్వండి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 22: స్వర్ణాంధ్ర-2047 కోసం ప్రజలు, విజ్ఞులు, విభిన్న రంగాల్లో విశిష్ట ప్రతిభ చూపే వ్యక్తులు, సంస్థల తరఫున ప్రతినిధులు, విద్యార్థులు తమ సూచనలు, సలహాలు ఇవ్వడం ద్వారా స్వర్ణాంధ్ర సాధనలో పాలుపంచుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. దీనిపై ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే విధానంలో ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారన్నారు. జిల్లాలో అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా పాల్గొనాలని చెప్పారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి మీ పేరు, ఫోను నెంబరు, ఈ-మెయిల్ ఇతర వివరాలు పొందుపరచాలన్నారు. మీ మొబైల్‌కి ఓటీపీ నమోదుచేసి ప్రశ్నావళిలో ఇచ్చిన ప్రతిపాదనలను మీ ఐచ్ఛికం లేదా అభిప్రాయాన్ని తెలియజేయాలన్నారు.

'ఉండి ఎమ్మెల్యేను అరెస్ట్ చేయాలి'

నల్లజర్ల, సెప్టెంబరు 22: అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును అరెస్ట్ చేయాలని మండలంలోని పలువురు అంబేద్కర్‌వాదులు డిమాండ్ చేశారు. ఆదివారం దూబచర్ల సెంటర్‌లో మానవహారం జరిపి అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గం కాళ్ళ మండలం ఏలూరుపాడులోనున్న ఫ్లెక్సీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్టయితే అధికారులతో తొలగించడం సమంజసమన్నారు. తక్షణమే ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో తోట రామారావు, బంటుమిల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతలో రాజీకి తావులేదు



వంటశాలల్లో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతలో రాజీపడే ప్రసక్తే లేదని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్(ఏఎఫ్‌సీ) బి.శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆహారంలో విషయంలో నాణ్యతా ప్రమాణాలు లేవని గమనిస్తే వెంటనే జిల్లా ఆహార భద్రతా అధికారి 9849848070, తన నెంబరు 9989688699కి ఫోన్ చేయాలని ఆయన సూచించారు. రాజమహేంద్రవరంలోని ఆదివారం పలు రెస్టారెంట్లు, ఈట్‌స్ట్రీట్‌లో తనిఖీలు నిర్వహించారు. వంటకాల్లో వినియోగించే సరుకులు, పెరుగు తదితర పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కి పంపించామన్నారు. కొన్నింటిలో నిబంధనల ఉల్లంఘనలు గమనించి అక్కడికక్కడే జరిమానాలు విధించామన్నారు. మంజీర, షెల్టన్, శ్రీకన్య, సితార, ఈట్‌స్ట్రీట్‌లోని ఫుడ్ స్టాల్స్‌లో విస్తృత తనిఖీలు చేశామని శ్రీనివాస్ తెలిపారు. ఈట్‌స్ట్రీట్‌లోని ఫుడ్ స్టాల్స్‌లో వంటనూనె టీపీసీ రీడింగ్ నిబంధనల ప్రకారం ఉండకపోవడంపై కేసు నమోదు చేశామన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో కచ్చితంగా పరిశుభ్రత పాటించాలన్నారు. తనిఖీల్లో జిల్లా ఆహార భద్రతా అధికారి వి.రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి

కొవ్వూరు, సెప్టెంబర్ 22: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు జాతీయ బృందగాన పోటీలను నిర్వహిస్తుందని భారత వికాస పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ ఎల్లాప్రగడ రమేష్ అన్నారు. ఆదివారం కొవ్వూరు సంస్కృత కళాశాల ప్రాంగణంలో భారత్ వికాస్ పరిషత్ సంపర్క్ సంసర్క్ సహయోగ్ సేవా సమర్పన్ అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని విద్యార్థులకు తెలుగు, హిందీ, సంస్కృత భాషల్లో జానపద గీతాలు, భారత్ కో జానో క్విజ్ పోటీలను నిర్వహించారు. భారత్ వికాస్ పరిషత్ నేషనల్ సెక్రటరి ధూళిపాళ పురుషోత్తమశాస్త్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 10 తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు దేశవ్యాప్తంగా జాతీయ బృందగాన పోటీలు నిర్వహిస్తామన్నారు. నేషనల్ గ్రూప్ సాంగ్స్ పోటీలలో 15 బృందాల్లో, భారత్ కో జానో క్విజ్ పోటీలలో 15 బృందాలు పాల్గొన్నాయి. ఈ పోటీలలో 17 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా డీఏవి పాఠశాల, సద్గురు పాఠశాల, నారాయణ, కుమారదేవం జడ్పీ హైస్కూల్, మున్సిపల్ హైస్కూల్, సంస్కృత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో దోర్బల ప్రభాకరశర్మ, టీఎస్‌వీ రమణమూర్తి, జీబీవీ సుబ్రహ్మణ్యం, పురుషోత్తం శాఖ అధ్యక్షులు డాక్టర్ వై.రమేష్, ఎస్. శరత్, ఎస్.రాఘవేంద్రరావు, ఏఎస్ఎస్ కిరణ్, డాక్టర్ గౌరీశంకర్, టి.రామచంద్రరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



వరద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న వెంకట్

తాళ్ళపూడి, సెప్టెంబర్ 22: ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ ద్వారా సేకరించిన విరాళంతో వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు తాళ్లపూడి ఏఎస్ఓ జోడాల వెంకట్ తెలిపారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ ద్వారా విరాళం సేకరించారు. ఆదివారం స్నేహితులతో కలిసి విజయవాడ రాజేశ్వరినగర్, బుడమేరు వంతెన, సింగ్‌నగర్, వాంబేకాలని, వైఎస్ఆర్ నగర్, సితార జంక్షన్‌లో గుహ వద్ద సుమారు 200 మందికి నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. వరద బాధితులకు సరుకు రవాణా చేయడానికి వాహనాన్ని అందించిన గోకవరపు మాణిక్యానికి, ఆర్థిక సహకారం అందించిన మాంటిస్సోరి పాఠశాల ప్రిన్సిపాల్ అనీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్ 1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్
నిడదవోలు	
వీ మ్యాక్స్	మత్తు వదలరా 2
రాధాకృష్ణ	ది గోట్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్